# అవ్యక్తం.

సాయంకాలం అయిదుగంటలయ్యింది. "గణేష్ అండ్ కో" అని వెలిసిపోయిన 'బోర్డు' వేలాడుతున్న ఒక పాతపడిన మేడ హాలులో 'అర్టు' టైపు మిషన్లూ, టకటక్ మనటం ఒక్కసారిగా మానివేసాయి. ఆ హాలులో పద్దెనిమిదవ శతాబ్దపు గడియారం, తుప్పువదిలించుకుంటూ, కిర్రుమని మూలిగి, అయిదుగంటలూ ఆగి కొట్టేసరికి, రెండేసి ఎర్రని గాజులు వేసుకున్న రెండు తెల్లటి అతినాజూకైన చేతులు టైపు మిషన్ మూసేసి, ఫైలు సర్దటం ప్రారంభించింది. అది చూసిన ఒక బట్టతల, ఇంకో గుండూరావుకి కనుసైగ చేసింది. గుండూరావు తల ఒకసారి టెంకాయి చిప్పలా పైకీ, క్రిందకీ వూగి, మళ్ళీ ఫైళ్ళల్లో దూరింది. ఎర్రని గాజులున్న చేతులు ఫైలు మూసేసి, ఎవ్వారికేసి చూడకుండా, హాలులో ఒకప్రక్కగా కనపడుతూన్న స్వింగ్ డోర్ గల గుమ్మంకేసి వెళ్ళి, ఆ స్వింగ్ డోర్ తెరచుకుని లోనికి వెళ్ళింది. ఈజీఛైర్‌లో కూర్చుని, స్పెన్సర్ ధూమాస్వాదనలో మైమరుస్తున్న ఒక నడి వయస్సు మనిషి గభాలున ముందుకు వంగాడు. ఫైలు షెల్ఫులో సర్దేసి రిజిష్టరులో సంతకం చేస్తున్న అమ్మాయి నుద్దేశించి–

"చూడు తారా! జి. జి. రాం. అండ్ కో. వాళ్ళ కాగితాలేవో నీ దగ్గరున్నట్లు చెప్పాడు వెంకటప్పయ్య. అవి పూర్తి అయినాయా?" అన్నాడు.

"లేదుసార్ ! ఇందాకనే చూసాను. రేపు పూర్తి చేస్తానులెండి." అంది తార.

"ఇవ్వాళ నాలుగుసార్లు కబురంపేడు ఆయన! అర గంట ఆలస్యం అయితే ఏం! కూర్చుని పూర్తిచేసెయ్యి! బాగా ఖర్చుపెడతాడు రెండుచేతులూ పూటుగా తడుపుతాడు." అదోరకంగా నవ్వాడు. స్పెన్సర్ ధాముడు.

"మీకు తడుస్తే, మాకేం లాభం సార్? ఆ కాగితాలన్ని టైపు చేసేసరికి మా చేతులు ఎండుతాయి." తార వెనుకగా వచ్చి రిజిష్టర్‌లో సంతకం పెడుతున్న రాజు అన్నాడు.

తార తరఫున వకాలతు తీసుకున్నట్లుగా మాట్లాడుతున్న రాజువెంపు చూసి-

"నువ్వుకూడా దస్త్రం కట్టేసావా రాజూ? ఇంకేం? ఒకళ్ళని చూసి ఒకళ్ళు, అంతా లేచేస్తారు ఇంక!" అన్నాడు గణేశయ్యరు. ఆయన అన్నట్లుగానే, రాజు వెనకాతలే ఒక బట్టతలా, రెండు గుండు రావులు, సగం నెరసిన క్రాఫింగూ, ఒక సిగజుట్టుకున్న స్త్రీ కూడా వచ్చి, రిజిష్టర్ చుట్టూ గుమి గూడారు. వాళ్ళని చూసి గణేశయ్యర్ "హుఁ" అన్నాడు.

"తారా? చూడు! నువ్వేదో చిన్నదానివని, ఇంకా కొత్త అని జాలి తలచి ఏమీ అనకుండా వుంటే, అందరూ నువ్వు లేచే సరికి, నీ వెనకాతలే వాళ్ళూ లేచేస్తున్నారు. కూసే గాడిద వచ్చి, మేసే గాడిదని చెరిపిందట అల్లావుంది. నీ పని!

ప్రతీ కాగితాన్నీ మీలో మీరు ట్రాన్స్ఫర్లు చేస్తూ కూర్చుం టారు తప్ప అసలు పనిచేయరు. ఆ గోపాలరాం ఎన్నిసార్లు తిరిగారో లెఖ్కలేదు. ఇలా, ప్రతీపనీ జాగుచేస్తే, కంపెనీకి పరపతి నిలుస్తుందా?" అన్నాడు.

తార తలవంచుకుని నెమ్మదిగా అంది.

"వాళ్ళసంగతి నా ఫైలులోకి వచ్చినట్లే చూడలేదు సార్ ! లేకపోతే అదే ముందు పైపుచేద్దును రేపు ముంద స్తుగా ఆయన కాగితాలే ఫినిష్ చేసి పంపిస్తానులెండి!"

"అర్జంటు మొర్రో అని మానేజర్‌గారు అంటూంటే, రేపు చూస్తానంటా రేమిటి?" బట్టతల కచ్చగా అన్నాడు.

"నాకు తలనొప్పిగా వుంది ఈ రోజు! అంత మరీ అర్జంటు అయితే మీరో, రమగారో అయిదు నిమిషాలు ఆగి ఆ కాగితాల పని చూడండి" అంది తార. బట్టతల పెదాలు చెవులదాకా సాగదీసుకుని, రమ అనబడే సిగజుట్టు కున్న స్త్రీ వెంపు చూసాడు.

రమ చర్రుమని బుస్సలు కొట్టుతూ, అంది.

"నా కింట్లో వేరేపని లేదా ఏమిటి? నీలాగ అర్ధ రాత్రి దాకా పార్కుల్లోనూ, బీచ్‌లోనూ షికార్లు కొట్టటం కుదరదు నాకు! ఇంట్లో చంటిపాప! ఇంటికి పోగానే వంట చేసుకోవాలి! పోనీ కూడా కూడా ప్రేమిస్తూ తిరుగుతాడు కదా రాజు! అతను నీ వంతుపని చేస్తాడా అంటే, తనపనే తను చేయక, ఒక చుట్టలకట్ట కొనిచ్చి, ఏ వెంకటప్పయ్యా చేతనో చేయించుకుంటాడు. ఎవరికి వారే యమునాతీరే

అన్నట్లు ఎవళ్ళపన్లు వాళ్ళు చేయకుండగా, ఎవరినెత్తిమీద ఫాయిస్ట్ చేద్దామా అని చూస్తూంటారు మీరంతా ! నా వంతు పనేదో నేను గమ్మున ముగించుకుంటే మీ కందరికీ కన్నెర్రగా వుండి నా నెత్తిమీద తోద్దామని చూస్తారు. ఇదేం న్యాయం! నా కింట్లో గడిచే విధంలేక చేస్తున్నాను. కాని వుద్యోగం అంటూ రోడ్డట్టుకుని తిరగటానికి చేస్తు న్నానా?" రమ కళ్ళు తడి అయ్యాయి.

"రమగారూ ? అప్పుడే, తార చేయాల్సిన పని అంతా మీ నెత్తిన పెట్టినట్లు బాధపడతారు దేనికి ? తార మటుకు పెళ్ళీ పేరంటం అయితే వుద్యోగంచేయనని అందా ఏమిటి ? మీ వుద్యోగం మీ పిల్లల్ని పెంచేదుకు వుపయో గిస్తోంటే ఆమె వుద్యోగం ఆమె ఆకర్షణని పెంచేందుకు ఉపయోగించుతోంది. మీ రున్నవారే ఇద్దరుకదా! ఆమె గారు అందమైన పిల్లదికనుక ఆమెచే తక్కువపని చేయి స్తున్నారేమో అని మీరూ ; గృహిణి, పిల్లలున్న తల్లి కనుక మీరంటేనే ఎక్కువ సానుభూతి వుంటుందని ఆమే అపోహలుపడి, ఒకళ్ళమీద ఒకళ్ళు మాటలు విసురు కుంటూ కూర్చుంటారు. మీరు ఇద్దరూ పరస్పర సహ కారంతో పనిచేయాలి కాని ఒకళ్ళమీద ఒకళ్ళు అసూ యలు పెంచుకుని, ఆఫీసుల్లోకూడా గృహవాతావరణం సృష్టించితే ఎల్లాగ చెప్పండి?" ఒక గుండూరావు వుప న్యాస ధోరణిగా అన్నాడు.

"అబ్బబ్బ! చంపుతున్నారు నన్ను! ఇదేం ఎన్ని

కల ప్రచార నిమిత్తం ఏర్పాటు చేసిన సభావేదిక అను కున్నారా? ఒకళ్ళమీద ఒకళ్ళు నిష్ఠూరాలు వేసుకోవ డానికి? కాస్త రోడ్డుమీదకు వెళ్ళి మరీ ఇవ్వండి ఇచ్చే వుపన్యాసమేదో! పని కించిత్తు అయినా చేయరు. బడా నాయకులల్లే వాగ్ధోరణి మటుకు వుంది!" అన్నాడు. గణేశయ్యర్. ఆయన ఆ కంపెనీకి మానేజర్. ఆయన ఎంత విసుక్కున్నా ఎవ్వరూ భయపడరు ఆయనవద్ద అంద రికీ చనువుంది. ఆయన బాగా కోపం చూపించినా, మరి కాసిని ఖబుర్లు ఎక్కువ చెప్పి ఆయన్ను నవ్విస్తారు.

"అదికాదు బాబాయిగారూ? నా వర్కేదో నేను కిక్కురు మనకుండా చేయటంలా? ఇంటిదగ్గర చంటిపాప! వంట చేసుకోవాలి! తారలా వంటరిదాన్నయితే రాత్రి పదిగంటలదాకావుండి వర్కు చేయమన్నా చేసేదాన్ని! తారకేం చెప్పండి! అలా పూరమ్మాట బలాదూర్లు తిరక్క పోతే, బుద్ధిగా ఆఫీస్‌లో కూర్చుని అర్ధగంట ఎక్కువ పని చేస్తే అరిగిపోతుందా?" అంది రమ.

"చూడు రమా! తార చిన్నపిల్ల! పైగా కొత్త. మీరు చేయలేనివి ఆమెతో వెంటనే చెప్తే చేసేస్తుంది. మీరు ఆ 'గోపాలరాం' కాగితాలు ఇవ్వటమే ఈ రోజు ఇచ్చారు. మరి రేపు చూడండి తప్పక చేసేస్తుంది. ఆర్నెల్ల నించీ గమనించుతున్నాను. దేనికీ తారకి రిమైండర్లు పంపక్క ర్లేకుండానే పని చేస్తోంది. ఒకళ్ళపని ఒకళ్ళకి అప్పచెప్ప

కుండా, ఎవళ్ళపని వాళ్ళు చేయిండని ఇదివరకు లక్షసార్లు చెప్పాను. కాని మీరు వినటంలేదు" అన్నాడు గణేశ్.

"అది కాదండీ!" అంటూ ఏదో చెప్పబోయిన గుండూరావుని మధ్యలోనే ఆపి-

"ఇంకేం చెప్పకండి. దయయుంచి ఇప్పటికి వెళ్ళి పొండి! అన్నాడు గణేశ్. అంతా నిశ్శబ్దంగా బయటకు వచ్చేసారు. గణేశ్ ఏవో కాగితాలు చూసుకుంటూ కూర్చు న్నాడు.

## 2

చల్లని సాగరతీరం. నింగి నీలాల దుప్పటిమీద చమ్కీ నక్షత్రాలను చూస్తూ తార రెండు అరచేతు ల్లోనూ తలవంచుకుని, ఇసకమీద బోర్లగిలా పడుకుంది. రాజు జేబులోని బఠాణీల్ని ఒకటొకటే తీసి నోటిలో వేసుకుని పటపటాన ముల్తున్నాడు. నిశ్శబ్దంగా ఆకాశం మీద నక్షత్రాల మెరుపుల మురుపుని గమనించి పరవశమై పోయే తారకి ప్రక్కన "కటుకూ కటుకూ" మంటూ బఠాణీలని నమలటం విసుగు కలిగించింది.

"ఏమిటిండిపోతువి రాజూ? ఈ చల్లని ప్రశాంత ఏకాంతములో ఒంటరిగా వున్న చిక్కని పాలమీగడ లాంటి కన్నెపిల్ల సన్నిధ్యములో కూడా నీ తిండి గొడవే

తప్ప ఇంకేమీ గమనించవు కదా ? ఇంత జడత్వం నీలో ఎల్లా కూడుకుందో నాకు ఆశ్చర్యంగా వుంది." అంది తార.

"నాకూ ఆశ్చర్యంగానే వుంది తారా! తిండీ తిప్పలు అక్కర్లేకుండా నువ్వు రోజులకి రోజులు, ఆకాశాన్ని సముద్రాన్ని చూస్తూ, ఆహార నిద్రాదుల్ని విసర్జించగల నిగ్రహశక్తి భగవంతుడు నీ కెందుకు ఇచ్చాడా అని ఆలోచిస్తూ వున్నాను. నా కింత ఆకలి దప్పుల్ని సృష్టించిన దేముడూ, నీ కింతటి నిర్మోహత్వం సృష్టించిన దేముడూ సవతి అన్నతమ్ములై వుంటా రనుకుంటాను." బఠాణీలను గుప్పెడు తీసి ఇంకా గట్టిగా నములసాగాడు రాజు.

"ఇంక ఆపు నాయినా! నీ అశనధ్వని వినలేక పోతున్నాను." అంది తార.

"ఇంక విసుగు వచ్చినట్టుంది. పోదామా !" అన్నాడు రాజు.

"అప్పుడే ?" అంది తార.

"అప్పుడేనా అంటావా? చంద్రుడు నడినెత్తికొచ్చాడు చూడు !" అన్నాడు.

"నీ నోటిలో ఎప్పుడు తిండి అయిపోతే, అప్పుడే లెమ్మంటావు ! చూడు రాజు! ప్రకృతి వేసిన చల్లనిపందిరి క్రింద హాయిగా, అరగంట కూర్చుని ఆ సౌందర్య దృష్టిలో పరవశించలేవూ! ఎందుకని ? నీ గదికివెళ్ళి, ఏం చేసుకుంటావు ? నీలాంటి వాజమ్మలని, నలుగురిని వెంటేసుకుని

చాలీ చాలని చింకి చాపమీద దొర్లటమేకదా నీకున్న రాచకార్యం !" అంది.

"తారా! నీలాంటి సున్నిత హృదయాలతో సరస వచనాలు పల్కుతూ, మధురగీతాలు పాడటం నాకు రాదు. నా దగ్గర ప్రస్తుతం ఆరు నయాపైసలున్నాయి! ఇవ్వాళ ఇంకా ఇరవయి ఎనిమిదో తారీకు! రేపు అర్ధనా ఎల్లుండి అర్ధనా అని రోజుకి అర్ధనా చొప్పున ఖర్చుపెట్టు కుందామని లెక్కవేసుకున్నాను. అంచేత నీ దగ్గర ఏమన్నా డబ్బులుంటే పడెయ్యి. అర్ధనిముషంలో బఠాణీలు కొను క్కొచ్చి నీకు సాయం కూర్చుంటాను. అర్ధరాత్రి దాటినా నీ సౌందర్యోపాసనకి అడ్డురాను." అన్నాడు రాజు. తార వత్తిగిల్లి రాజువెంపు చూసింది. రాజు లాల్చీ జేబులోంచి ఏవో తీసి ఇసకలో పడేస్తున్నాడు రెండు బీడీలు ఒక అయిదు పైసల నాణెం, ఒకరాగిపైస, ఒక చిన్న కాగితపు పొట్లాం తీసి పైకి పడేసాడు.

"ఆ పొట్లామేమిటి రాజూ!" అడిగింది తార. రాజు నల్లనికళ్ళు తళుక్కున మెరిసాయ్! ఆకాశంలోని నక్షత్రా లల్లే మెరుస్తున్న రాజు కళ్లవెంపు తార ముగ్ధురాలై చూసింది.

"నీతో చెప్దామనుకుంటూనే మర్చిపోయాను తారా ! సాయంత్రం ఇటు వస్తూనే కోవెల్లోకి వెళ్లాను. అక్కడ ఎవరో కుంకుమ పూజ చేయిస్తూ వుంటే కాస్త కుంకుమ తీసి పొట్లాంకట్టి తీసుకివచ్చాను నీకిద్దామని! ఇది తీసుకుని

అమ్మవారిని తలుచుకుని నుదుట బొట్టు పెట్టుకో! సకల సౌభాగ్యాలూ కలుగుతాయ్!" అన్నాడు రాజు.

"20 వ శతాబ్దంలో కూడా నీకీ మూఢ నమ్మకా లేమిటి రాజూ!" కాళ్లతో ఇసకని గుచ్చి పైకి తన్నింది తార.

"అల్లా మూఢ నమ్మకం అంటూ తేలిగ్గా తీసి పారెయ్యకు తారా! భగవంతునిమీద నమ్మకం వుంచు కున్న ఏ వ్యక్తీ కూడా ఇంతవరకు చెడిపోలేదు."

ప్రార్థన విన్పించినట్లయింది తారకి. గమ్మున లేచి కూర్చుంది. మోకాళ్ల చుట్టూ చేతులు బిగించుకుంది. సన్నని గాలి తెరకి ఆమె నల్లని నేను రెప్పలు అల్లల్లాడాయి.

"రాజూ! నేను పుట్టి పెరిగాక, తన్ని ఎలానూ నమ్మ లేనని తెలుసుకాబోల్ను ఆ భగవంతుడికి! నాకు జీవితం లోని కష్ట నిష్ఠూరాలు స్వానుభవంలోనికి రావాలని నన్ను మాతాపితృహీనని చేసాడు. కాని నిన్నుకూడా, అల్లానే దేనికి సృష్టించేడు? వుదయం లేచింది మొదలు రాత్రి పడు కునే దాకా రామనామ జపం చేస్తావు కద? నీకే కనుక అమ్మా, నాన్నా వుంటే బోల్డు డబ్బు వుంటే, దర్జాగా కార్లలో తిరుగుతూ, యూనివర్సిటీలని, ఎగ్జామినేషన్ ఫీజు లనే పేరుతో పోషిస్తూ కాలం గడుపుదువుకదా! మన దేశంలో పనీ పాటా లేని ధనిక విలాసులు వేలమంది వున్నారు నీమీద దయవుంటే ఆ భగవంతుడు నిన్ను

2)

కూడా ఒక ధనిక విలాసునిగా సృష్టించి వుండేవాడు." అంది.

"భక్తుల్ని బాగా పరీక్షించికాని ప్రసన్నం మవడు తారా భగవంతుడు! నా జన్మలో ఆ భగవంతుడు పెట్టిన పరీక్ష నెగ్గలేననుకుంటాను" నిర్వేదంగా అన్నాడు రాజు. తటాలున ఎందుకో తార హృదయమంతా ఎంతో బాధతో బరువైపోతున్నట్లు తోచింది. "ఎందుకీ వేదాంతం మాట్లాడు తున్నాడు రాజు ?" అని తనలో తనే అనుకుంది. అయినా తనలో కూడుకొంటున్న నిర్వేదాన్ని తుత్తునియలుచేసి గొంతులో లేని వుత్సాహాన్ని నింపుకుంటూ-

"ఏం పరీక్షలు మహాను భావా ? నీ మటుకు నువ్వు రెండుపూటలా నిండుమనస్సుతో దేవిని సందర్శించివస్తూం టావు కదా ? కనీసం రెండురోజులకి సరిపడ్డ బఠాణీలడబ్బులు అయినా దేవి నీకు రోడ్డుమీద దొరికేట్లు చేసిందాచెప్పు! నీకు ఆ మాత్రం సాయం చేస్తేనే ఆ దేవి మహత్తు తగ్గి పోతుందా ఏమిటి ?" అంది.

తేలిగ్గా నవ్వుతూ, ముఖమంతా చిలిపితనం చిందు తూన్న ఆమె ముఖంవెంపు రాజు కొంచెంసేపు దీక్షగా చూసాడు, ఏమీ తోచక కాస్సేపు చిందరవందరగా ఎగురు తూన్న ఉంగరాల క్రాఫింగ్ జుత్తుని చిరాగ్గా పీక్కున్నాడు. మనస్సులో -

"భగవంతుడా? ఈ అమ్మాయికి ఏంజవాబుచెప్తాను?" అని విసుక్కున్నాడు. ఇంతలో రాజు కళ్ళు విస్ఫారితంగా

విప్పుకున్నాయి. రాజుకాళ్ళకి కాస్త ఎడంగా, ఇసకలో దొర్లు తున్న నల్లటి వానిటీ బాగ్ కనపడింది. రాజు చప్పున ఎడం చేతితో ఆ బాగ్‌ని తీసి జిప్ వూడలాగి చూసాడు. అరచేయి అంత అద్దం, చిన్నప్లాస్టిక్ దువ్వెనా, చిన్నసైజ్ వ్యానిషింగ్ క్రీమూ, బస్ పాసూ, రెండు వుతికిన ఎర్ర రిబ్బన్లూ, రెండు పావలాకాసులూ వున్నాయి. రాజు ఒక పావలాతీసి, జేబులో వేసుకున్నాడు ముఖం నిండా గంభీరం పులుము కున్నాడు ఇసకలో కాళ్ళు గుచ్చుతూ దొర్లుతున్న తార రాజు వెంపు చూట్టంలేదు.

"కాస్త నా మాట వింటావా తారా?" అన్నాడు రాజు.

"ఏమిటయ్యా చిట్టితండ్రీ! దేవి సాక్షాత్కరించిందా కొంపతీసి?" నవ్వుతూ దొర్లింది తార.

"ముందు నువ్వు అల్లా గింగిరాలు తిరిగిపోకుండా కూర్చొని కాస్సేపు! తర్వాత నెమ్మదిగా అన్ని వివరాలు చెప్తాను." మందలిస్తూ తీవ్రంగా అన్నాడు రాజు. తారకి రాజుమీద కోపం వచ్చింది.

"ఏమిటి రాజూ ఆ అధికారం?" అంది.

"అధికారమా! నీ మీదా? నేనా? తప్పు తప్పు! అల్లా ఎప్పుడూ అనుకోకమ్మాయ్! నీమీద నా కెన్నడూ అధికారం కావాలనుకోవటంలేదు."

"మరేం అనుకుంటావేం?" వుడుకుమోత్తనం వొచ్చింది తారకి.

"నీ అనుగ్రహం కావా లనుకుంటున్నాను. కాస్త నే చెప్పబోయేది తీరిగ్గా వినమని వేడుకుంటున్నాను" అన్నాడు.

"ఏం వేళాకోళంగా వుందీ నీ పని! సర్లే నీ కథేదో చెప్పు! వినక తప్పుతుందా?" లేచి కూర్చుంది తార.

రాజు తీరిగ్గా సినిమా కథ చెప్తున్న ధోరణిలో ప్రారంభించాడు.

"విను తారా! అల్లాకో వెల్లోకి వెళ్లానా, వెళ్ళి నీ కోసరం కుంకుమ తీసుకుని పొట్లాం కట్టి జేబులో వేసుకుని, అల్లా ప్రదక్షిణంచేసి వచ్చి కళ్యాణ మంటపంలో పద్మాసనం వేసుకూర్చుని కళ్ళు మూసుకుని ధ్యానం చేసాను."

"ఏమని?"

"వినుమరి! 'దేవీ! దివ్యమంగళ స్వరూపిణీ? జగదంబా! ఈ అజ్ఞానుని, ఈ మూర్ఖుణ్ని క్షమించి ఈ అల్పుని కనీస కోర్కె నెరవేరేట్లు అనుగ్రహించు! నాకు నెలాఖరుదాకా బఠాణీలుకి సరిపడ్డ డబ్బులూ, మా తారకి గొప్ప జమీందారు భర్తగానూ, లభ్యమయ్యేట్లు అనుగ్రహించు జననీ! నన్ను కరుణించి ఆశీర్వదించు పావనీ!' అన్నానో లేదో, ఆ పళంగా ఏమయిందో తెల్సా! నా కళ్ళకి మగత క్రమ్మింది. నెమ్మది నెమ్మదిగా నా కన్నుల ముందు అపూర్వ తేజముతో దేవి సాక్షాత్కరించింది. ఆ దివ్యసుందర విగ్రహాన్ని చూస్తే, నా కళ్ళు మరింత చీకటులు క్రమ్మాయి. అల్లాగే ఆ దేవిముందు సాష్టాంగ పడ్డాను. అంతట ఆ దేవి

'వత్సా లెమ్మ! నీ కోరిక తీరును! నీ అభీష్టము అచిరకాలములోనే నెరవేరును. నీ చేతిలో వున్న కుంకుమ తీసుకువెళ్ళి నీ తార నుదుట ధరింప చేయుము! నీవుకూడా నుదుట ధరింపుము. నన్ను వెంటనే తల్చుకోనుము. నీవు నడిచే త్రోవలో బేడకాసు దొరుకును. అది తీసుకొనుము.' అని చెప్పింది. అప్పుడు నేను

'దేవీ తమరు తప్పు సెలవిచ్చినారు. నా అపరాధం మన్నించాలి అల్పుణ్ణి, అనర్హుణ్ణి! ఈ కాలంలో బేడ కాసులు మారవు అని తమరు మరిచిరి!' అన్నాను.

'వత్సా! నానాలిక్కి తిరుగలేదు. ఏం చేయను? అట్లయిన, సముద్రతీరాన్న, చక్కని కన్నె సమీపాన్న అంజలిబద్ధుడవై, రామేశ్వరుణ్ని తలుచుకొనుము. వెంటనే, నీకు పావలాకాసు ప్రత్యక్షమగును' అని చెప్పి అంతర్హిత మయినది ఆ శ్రీదేవి. ఆ దేవి అపాంగ దృష్టివలన నా కిప్పుడే ఒక పావలాకాసు లభ్యమయినది. అది ఫస్టుదాకా బెస్టుగా సరిపోతుంది. ఇంక నీ ఉజ్వలమైన భవిష్యత్తుకోసం, నీవుకూడా, ఆ కుంకుమని తీసి నుదుట బొట్టు పెట్టుకో తారా!" అన్నాడు రాజు. తార తనబాగ్ తీసుకుని చూసి అందులో ఒకపావలాకాసుని రాజు చెక్కేసాడని గ్రహించింది తల పంకించింది.

"రాజూ! ఆ కుంకుమని నువ్వే బొట్టు పెట్టుకో! పెద్ద జమీందారువి అయిపోతావు? రోజుకో బస్తాడు బతాణీలని తినొచ్చును! వెధవ దొంగవేషం! నా పావలా

కొట్టేసి దేవి సాక్షాత్కరించిం దంటున్నావా ? ఆ ముఖం చూడండి ! డో కొస్తోంది ! వెదవ దొంగముఖం !" కోపంతో ఎర్రబడిన తార ముఖం వెన్నెల్లో వేయి కాంతులతో వెలిగిపోతూంటే, రాజు చూసి ఆగలేకపోయాడు. పట్టరానంత ముద్దువస్తోంటే రాజు దగ్గరగా వచ్చి, ఆ కోమలమైన ముద్దుముఖాన్ని సున్నితంగా, మునివ్రేళ్ళతో గడ్డం పుచ్చుకుని పైకి ఎత్తి పట్టుకొని కుంకుమని ఆమె లేత నుదురుమీద గుండ్రముగా దిద్దుతూ—

"తారా! నేను పెద్ద జమీందారుని అవలేను. అవాలన్న కోర్కెకూడా నాకు లేదు. ఒకవేళ అదృష్టం కలిసి జమీందారుని అయిపోతే, నీ తోడి సాన్నిహిత్యం కోల్పోతానేమో ! నిన్ను దూరంచేసే ఆ జమీందారీ అదృష్టాన్ని నే నెప్పుడూ కోరదల్చుకోను! నువ్వే పెద్ద రాణివి అయిపోవాలి ! అప్పుడు, నా బత్తాశీలికి సరిపడే భుక్తిని నువ్వు శాంక్షన్ చేద్దువు కాని ! నిన్ను మహాభోగభాగ్యాలతో తులతూగే మహాసామ్రాజ్ఞిగా చూడాలనే నాకు జీవితంలోని పెద్ద కోరిక ! ఒకే ఒక తీరని ఆరని తృష్ణ !" ఆపేక్షగా అన్నాడు రాజు. తారకి రాజు మాట్లాడేదేమీ అర్థం కాలేదు రాజు సన్నని తెల్లని పొడుగాటి వ్రేళ్ళవంక జాలిగా చూసింది.

# 3

గణేష్ ఎదురుగా చిన్నముఖం చేసుకుని నిల్చుండి పోయిన తారని ఆశ్చర్యంగా చూసాడు గోపాలరాం. ఆరడుగులు పొడుగువుండి, పచ్చగా ధృఢంగా వున్న గోపాల రాం వెంపు, అతని సిల్కు-లాంగ్ కోటూ, పట్టు షేర్వానీ వెంపూ విస్ఫారితంగా చూసింది తార.

"నువ్వే చెప్పు! నీ చేతుల్లోకి కాగితాలు వచ్చి ఎన్ని రోజులయ్యిందీ?" గణేష్ కోపంగా ఉరిమాడు. గోపాలరాం వెంపు బిక్కగా చూసింది తార.

"ఊఁ! చెప్పుమరి?" మళ్ళీ అన్నాడు గణేష్.

"ఏం అమ్మాయ్! బోనస్ కాని ఇచ్చాడేమిటి? మా గణపయ్య!" వెటకారంగా అన్నాడు గోపాలరాం. తార ముఖం ఇంకా చిన్నబోయింది.

"సారీ సార్! ఎప్పటి కావాలో చెప్పండి!" కళ్ళల్లో నీ ళ్లూరాయ్.

"పది గంటలకి అందిస్తే ధన్యుణ్ని!" నవ్వాడు గోపాలరాం. తార తలవంచుకుని మెయిన్ హాలులోనికి వెళ్ళిపోయింది.

"పిచ్చి గణపయ్యా! ఇల్లాంటి నాజూకు నళినులు పన్లు చేస్తారా? వీళ్ళ వయ్యారాలు చూస్తే మిగిలిన క్లర్కు-

లకు కూడా పనిచెయ్య బుద్ధవదు. అయినా ఈ రోజా రోజాని ఎక్కడ సంపాదించావు?" అన్నాడు గోపాలరాం.

"లూసీ, జాన్సన్‌ని పెళ్ళాడి షెఫీల్డు వెళ్లిపోయిం దిగా! మళ్ళీ అడ్వర్టయిజ్ చేస్తే సేవాసదన్‌నించి వొచ్చింది ఈ అమ్మాయి! అంతాజేరి రెండునెల్లు అవు తుంది!" అన్నాడు గణేశయ్యర్.

"సేవాసదన్‌నించి వొచ్చిన అమ్మాయి యింత అందంగా వుంటుందా? ఈ తారామణిగూడ ఒక చందురిణ్ని వెతుక్కొని, నభోమండలానికి ఎగసిపోగల్దు జాగ్రత్త! ఎందు కోయ్ ఇల్లాంటి కుర్రనాగమ్మలని పెడతావు? ఆఫ్టర్ ఫార్టీ ఇయర్స్ వాళ్ళనిపెడితే నీకు కనీసం పది సంవత్సరాల సర్వీ సన్నా గ్యారంటీ వుంటుంది నీకు యీ భయొవ్యాపడివస్తున్నా టీ నేజ్ మీద మోజు వదల్లేదు." నవ్వాడు గోపాలరాం.

"నాకు మోజు ఏమిటయ్యా ఖర్మ! నేనేం నీకుమల్లే కోటీశ్వరుణ్ణా! ఏదో నాన్నారిపేరు నిలబెట్టాలని కంపెనీ నడుపుతున్నాను! ఎప్పుడో వున్న నాలుగు సైపుమిషన్లూ అమ్మి పారేసి కంపెనీ ఎత్తేసి కృష్ణా రామా అంటూ ముక్కు మూసుకుని జపంచేస్తూ కూర్చొంటాను. నాకేం కావాలి ఇంక!" అన్నాడు గణేష్.

"అవును నీకేం కావాలి? వున్న ఒక్కకూతురికీ పెళ్ళిచేసేసి భాధ్యత వదిలించుకున్నావు. ఏదో కంపెనీ పేరుతో నాలుగురకాల ఆడవాళ్ళనీ చేరుస్తున్నావు! జీవి తంలో వైవిధ్యం అనుభవించటానికి, పెట్టిపుట్టావురా

నాయినా! కాని ఒక్కటి చెప్తున్నాను విను! ఏకాలానికైనా ఇంటిలో ఒక ఆడతోడు వుండటం ఎందుకయినా మంచిది. కనుక నువ్వీ సన్యాసదీక్ష వదలి శుభ్రంగా మళ్ళీ గృహస్థాశ్రమంలోకి జొరబడు! పుత్రుడు లేనివాళ్ళు పున్నామనరక బాధలు అనుభవించాలని, నీకు తెలీదా!" అన్నాడు గోపాలరాం.

"నా మాట సరేలే! నువ్వుమటుకు తక్కువతిన్నావా? అల్లా ఘోటకబ్రహ్మచారిలా గాలికి తిరకపోతే, నువ్వో ఒక అమ్మాయిని చేరదియ్యకూడదూ! మీ అమ్మగారు సగం నీ మీద దిగులుతోనే తీసుకు తీసుకుపోయారుకదా! నా బోటి నిర్ధనులకే పుత్రుడు లేని పున్నామనరక బాధలు తప్పకపోతే, నీలాంటి జమీందార్లకి వారసుడు లేకపోతే భగవంతుడు వూరుకుంటాడా! నీకూ దగ్గర దగ్గర నలభయ్ ఏళ్లు వస్తున్నాయి! ఇంకెప్పుడు నువ్వు జీవితంలో స్థిరపడేది? ప్రిన్స్ రెయినీర్ నైనా గ్రేస్ కెల్లీ లొంగతీసింది కాని నిన్ను ఏ ఆడదీ లొంగతీయలేదాయె! ఇంకెలా చెప్పు! నువ్వో నీ అంతట నువ్వే ఏ అతివనైనా వలచి వలపించచేసుకొని తరించు! నా మాట విను!" నవ్వాడు గణేష్. గోపాలరాం పెద్దగా నవ్వాడు.

"బావుందోయ్! భేషుగ్గా వుంది! నీ నెత్తిమీద తేలుపడ్డది అంటే చూసేకళ్ళు, చెప్పే నోరూ వున్నవాడికి చేతులు లేవా తీయటానికి అన్నాడట! అల్లావుంది నీ

వ్యవహారం! మరి నే పోతాకాని మీ తారామణిని కాస్త తొందర చెయ్యి" గోపాలరాం లేచి వెళ్ళిపోయాడు. గణేశయ్యర్ పచ్చగా బొద్దుగా పొట్టిగా వుంటాడు. తెల్లగా చలువచేసిన సేలం జరీ అంచుపంచెలు లుంగీలా కట్టుకుని, ఖద్దరుసిల్కు బుష్‌షర్టులు ధరించుతాడు. సాధారణంగా ఆయన డ్రస్ అదే! గణేశయ్యర్ తాతలనించీ, ఆ కంపెనీకి బాగా పరపతి వుండేది. ఇప్పుడు గణేశ్ చేతిలోనికి వచ్చాక కంపెనీ బాగా లాస్‌లో నడుస్తోంది. దానికి కారణం స్థిరమైన భధ్యత తెలీని వాళ్ళని క్లర్కులుగా వేసుకోవటమేనని గోపాలరాంలాంటి హితైషులు అంటూంటారు. కాని గణేశయ్యర్‌ది ధర్మబుద్ధి అని, అందరూ ఒప్పుకుంటారు. అతని మొదటిభార్య పట్టమ్మ చనిపోయి ఇరవయి సంవత్సరాలు కావస్తోంది. ఇన్నాళ్ళూ గణేశయ్యరు తనకూతురు అంబికని పెంచి పెద్దచేయటమే తన జీవనధ్యేయంగా పెట్టుకుని కాలం గడిపాడు. రెండుసంవత్సరాలక్రితం పొన్నుసామి అనే క్లర్కుకి అంబికని ఇచ్చి పెళ్ళిచేసాడు. పొన్నుసామి అంబికని పెళ్ళిచేసుకున్నాక చేస్తోన్న వుద్యోగానికి రిజైను ఇచ్చి రెండు బస్‌లు కొని నడుపుకోవటం ప్రారంభించాడు. వున్న యిల్లూ, కాస్త మాగాణీ అమ్ముకొని, అల్లుడు బస్సులు నడుపుకోవటం గణేశయ్యర్‌కి నచ్చలేదు. మామగారికి నచ్చనిపని చేశాక, ఆయన కూతుర్ని ఆయనకి సహాయంగా వుంచటం పొన్నుసామికి నచ్చలేదు. అంచేత వేరుగా ఇల్లు తీసుకుని అంబికని తీసుకువెళ్ళి సంసారం చేస్తు

న్నాడు. గణేశయ్యర్ ఆఫీసుపని చేసుకుని ఇంటికి వెళ్ళే సరికి—

"అప్పా" అంటూ ఎదురొచ్చి, టీ చేసిపెట్టే కూతురు లేకపోవటంతో మొట్టమొదటి సారిగా ఇంటిలో ఇంకో స్త్రీ లేనిలోటు అగాధంగా తోచి అసహనం కలగించింది తనకు తను. స్టౌ వెలిగించుకుని టీ చేసుకోవటం అన్నం వండుకోవటం, భోజనం చేయటం ఇవన్నీ యాంత్రికంగా కేవలం దైహిక పరితృప్తికోసం జరిగిపోతున్నాయేతప్ప కావల్సిన మనోస్వాస్థ్యం కలిగించటం లేదు. ఇవ్వాళ గోపాలరాం అన్న వేళాకోళపుమాటలు ఆయనలో తెలీని చాలాకాలం నిస్వార్థ చింతనలో మాటుమణిగి పోయివున్న కోర్కెలు కాంక్షలు మెల్లమెల్లగా ఒళ్ళు విరుచుకుని కళ్లు విప్పుకుని లేచాయి.

# 4

"కమిన్ !"

పెద్ద రాజ సౌధంలాంటి భవనం! ఆ కమిన్ అన్న ధ్వని ఏ మూల నించి వచ్చిందో తెలుసుకోలేక ఆ హాలులో స్థాణువులా నిలబడిపోయి, దిక్కులు చూడసాగింది తార. ఆమె చిన్న తెల్లనిపాదాలు, ఖరీదైన కార్పెట్ కి అతుక్కు-

పోయాయ్! చేతుల్లోని కాగితాలు ఆమె గుండెల్లా గజగజ మని వణికిపోతున్నాయ్! ఆమె నుదుట పట్టిన స్వేదకణాల్ని సన్నని సున్నితమైన అలకలు స్పృశించబోయి కదలలేక అచేతన మయ్యాయి!

“కమిన్! మిస్……”

ఏదో మీడియం మాట్లాడినట్లనిపించింది తారకి. హాలులోకి కర్టెన్లు దించివున్న నాలుగు గుమ్మాలకేసీ తన చారడేసి కళ్ళన్నీ ఇంకా వెడల్పుచేసుకుని విభ్రమంగా చూడసాగింది.

“ఎవరమ్మాయిగోరూ? వోరికోసం?”

ఒక గుమ్మంలోంచి నౌకరువచ్చి ప్రశ్నించాడు వాడి కేసి చూసింది తార. వాడిచేతులో ట్రే, భుజంమీద టర్కీష్ నాప్కిన్నూ చూసింది తార.

“నేనూ! నేనంటే మరేమో ఈ కాగితాలూ” మాట తడబడింది తారకి.

“పైకి తీసుకురా, రా! వెంకా?”

“అప్పుడు పైకి చూసింది తార. హాలులో ఎడమ వైపునించి మేడమీదకి పోయే మెట్లున్నాయి. అన్నీ పాల రాతి మెట్లు! ఆ పైన నించున్నాడు గోపాలరాం. సన్నని జరీఅంచు పంచె కట్టుకున్నాడు. రెండుభుజాలమీదకూ వచ్చేట్లు టర్కీష్ తువ్వాలు కప్పుకున్నాడు అభ్యంగనం చేసేడేమో, వొత్తుగాఉన్న వుంగరాల జుత్తులోంచి తెల్లగా తళతళ మెరిసే వెండివెంట్రుకలసంఖ్య ఎక్కువగా కన్పట్టుతో

మనిషి మనసుని మలిన పరచగల్గిన తమ ఘనతని గర్వంగా చాటుతున్నాయి.

"మీ కాగితాలు తెచ్చానండి !" నమ్రతగా అంది తార.

"పైకి రావొచ్చు ఫర్వాలేదు !" అన్నాడు.

"పదండి ! అమ్మాయిగోరూ !" వాడి కళ్ళకి తార చిన్నపిల్లలా అగుపించింది. మౌనంగా అనుసరించింది తార. వరండాలో చిన్న చిన్న పేముకుర్చీలమధ్య వున్న రౌండ్ టేబుల్ మీద ఆ కాగితాలు పెట్టి నించుంది తార ఆ టేబులు మీద వున్న చిన్న గ్రీక్ వనిత పాలరాతి శిల్పాన్ని చేతుల్లోకి తీసుకుని చూస్తూ.

"కూర్చో !" అన్నాడు.

ఎదురుగావున్న ఒక కుర్చీలో బుద్ధిమంతురాలల్లె కూర్చుంది. వెంకన్న 'ట్రే'ని టేబుల్ మీద వుంచి క్రిందకు దిగి వెళ్ళిపోయాడు.

"టీ తీసుకుంటావా ?"

వొద్దన్నట్లు తలూపింది. గోపాల్‌రాం టీ సిప్ చేస్తూ పక్కా అర్ధగంటా త్రాగాడు. అంతసేపూ తార ఇల్లు తన చూపు ఆనినంత మేర పరిశీలగా చూసింది. ఆ యింటిలోని ప్రతి అల్పఅణువూ ధనిక తత్వాన్ని, భోగలాల సత్వాన్ని నిరూపించేదిగా అలంకరించబడింది. గోపాలరాం తీరిగ్గా కాగితాలు చూసుకుంటూ, వెంకన్నని పిలిచి ఆ ట్రేని అక్కడనించి తీసెయ్యమని ఆజ్ఞాపించాడు. వెంకన్న

మెట్లమీద హాజరుగా వున్నాడేమో, వెంటనే వచ్చి ట్రేని తీసుకపోయాడు అర్ధగంట ముప్పావుగంట గడిచింది. గోపాల రాం కాగితాలు చదువుటలో పూర్తిగా నిమగ్నమయి పోయాడు.

"నేను వెళ్తానండీ" బెదురుగా అంది తార. ఆశ్చ ర్యంగా తలెత్తి చూసాడు గోపాలరాం.

"అరే! నువ్వికక్కడ కూర్చొనున్నట్లే గుర్తులేదు. వెరీసారీ! ఇంక కొన్నిటైపు చేయవలసిన కాగితాలున్నాయి ఇస్తాను. అర్జంటు మేటర్ వెంటనే పూర్తి చేసి తీసుకు రా!" అని కొన్ని కాగితాలు ఇచ్చాడు. తార ఆ కాగితాలు తీసు కుని మౌనంగా క్రిందకు వచ్చింది హాలులో వున్న గడి యారంవెంపు చూసింది. ఆ గడియారం తారవెంపు బిక్క చూస్తూ నీరసంగా జాలిగా పన్నెండు కొట్టింది ఆలో చిస్తూనే ముందు గార్డెనుదాటి, గేట్లోకి వచ్చి నిలబడింది. వైశాఖమాసపు మాధ్యాహ్నిక తీవ్రతని చూపిస్తూన్నాడు. తీక్ష్ణ ప్రతాపుడు అయిన యౌవన భాస్కరుడు. తార కాళ్ళకి చెప్పులున్నయ్. కాని గొడుగులేదు. అర్ధమైలుకి తక్కువలేదు ఆఫీసు! రిక్షాలో వెళ్దామంటే డబ్బులులేవు. నడిచివెళ్ళితే ఆలస్యం అయిపోతుంది. ఆలస్యం అయితే బాస్ ఏమన్నా అనుకుంటుంటారనే భయం! ఆయనవద్ద ఆమెకి ఎంత చనువు వున్నా చివాట్లు వేస్తేమటుకు చిన్నతనంగా వుంటుంది తారకి! సూర్య భగవానుడు, ఆమెలోని స్నిగ్ధ సౌకు మార్యం అతని హృదయాన్ని స్పందింపచేయటంవల్ల ముఖ

మంతా వేయి యుగాల వెలుగుని నింపుకుని, ఆత్రంగా తార ముఖాన్ని చూస్తున్నాడు ! ఆతనిలోని స్నేహపిపాసిని సౌహార్ద్రతని గమనించే స్థితిలో లేని తార అతని తీక్ష్ణతను మాత్రమే చూసి చిన్నబోయింది.

"అల్లా నిలబడిబోయావేం ? ఎండ చాలా ఎక్కువగా వుందికదూ !"

వెనుతిరిగి చూసింది తార. ఎప్పట్నించీ, వెనకాతల నిలబడ్డాడో గోపాల్ ! ఎండ తీవ్రతకి కందిపోయి ఎర్రని యాపిల్ పళ్ళల్లా వున్న ఆమె గుండ్రని బుగ్గలు చూస్తూంటే అతనికి తనబల్లమీది గ్రీక్ వనిత పాలరాతిశిల్పం కళ్ళముందు సజీవంగా నిలబడినట్లు తోచింది

"వెంకా !"

"అయ్యా !" వెంకన్న వచ్చాడు వినయంగా.

"కారు తాళాలు పట్రా !"

"జాన్ భోజనానికి వెళ్ళాడండీ !" అన్నాడు.

"అక్కర్లే ! నేనే డ్రైవ్ చేసుకుంటాను." కాస్సేపు నించో అమ్మాయ్ ! సారీ తారా ?" నవ్వాడు స్నేహపూరితంగా తార దిగ్భ్రమగా చూసింది అతనివెంపు ! పల్చని గ్లాస్కో లాల్చీ కూలింగ్ గ్లాసెస్ ! కొబ్బరిచెట్లనీడల్లో కారుషెడ్ వెంపు ఉన్నత శరీరుడైన ఆయన ధీమాగా నడుస్తోంటే, "హిమాలయోనామ నగాధి రాజః" అన్న కాళిదాస వచనం గుర్తుకివచ్చింది తారకి. ఒకవెంపు అమితమైన లజ్జలతోపాటు, అతనిపట్ల ఆసక్తికూడా కలిగింది. కారు

హారన్ వెనకాతలనించి "బంయ్" మనగానే కాస్త త్రోట్టు పాటుతో ప్రక్కకు వై దొలగింది.

"హర్రో!" అన్నాడు గోపాలరాం ఆజ్ఞ ధ్వనించింది అతని గొంతు

వెనకసీటు తలుపు తీద్దామనుకుంది తార. ఆ ప్రయత్నంలో విఫలురాలైంది.

ఆ తలుపుతో తార కుస్తీ పట్టటం చూస్తే నవ్వాగలేదు గోపాలుకి.

"ఇదుగో ఇటుచూడు తారా! మూసివున్న తలుపుని తెరవటంలో కాలం వృధాచేయటంకంటె తెరచివున్నద్వారం ద్వారా లోపల ప్రవేశించి కాలం విలువగూడ గట్టుకోగూడదూ?" అన్నాడు. అప్పటికే నెత్తిమాడుతోంది తారకి ఇంక చర్చించుకోవటానికి సావకాశంలేక గోపాలు ప్రక్కన కూర్చుంది తార. కారు నిశ్శబ్దంగా ఎర్రని ఎండలో నెమ్మదిగా సాగిపోతోంది. అప్పుడోసారి వెర్రెత్తిన ఎండలో దాహంకోసరం అరిచేకాకి అరుపు దీనంగా వినపడుతోంది. నున్నని కాలే రోడ్డుమీద కారు సున్నితంగా మెత్తగా జారుతూ పోతూంది అతనిచేతివాచీలో ముల్లు ఒంటిగంటని సమీపించటం చూసి తార గాభరాగా.

"కాస్త తొందరగా పోనివ్వండి!" అంది.

"నా వాచీ చూసావా? ఇది రాత్రి ఆగిపోయింది, నిద్దట్లో చేయిమంచంపట్టెకి కొట్టుకుంది కాబోల్ను పాడయిపోయింది. షాపులో రిపేర్‌కి ఇద్దామని బయలుదేరాను.

ఎల్లాగూ బయలుదేరాలి కదా అని నీకు వాహనయోగం కలిగిస్తున్నాను.” ఆమె శంఖంవంటి మెడవెంపు ఆపేక్షగా చూసి అన్నాడు.

తార మనసు ఎందుకనో చివుక్కు మనిపించింది.

అక్కడే అసలు చిక్కంతా ముడిపడింది. పురుషులు అనాలోచితంగా యథాలాపంగా చేస్తోన్న క్రియలు, అంటూన్న మాటలు బాలికలు ఆరాధనగా భావించి వారిని శిరీష మృదుల భాసితమైన తమ హృదయాలకి అధినేతలుగా చేసి వేస్తారు. పాత్రాపాత్రత తెలుసుకోకుండా తమ హృదయ భాండాల్లో నిండుతోన్న పీయూషాన్ని వాళ్ళ పాదాలమీద వొంపివేసి, ప్రణీతులమయి పోయామనే భ్రమలో జీవితాల్ని అర్పితం చేసుకుంటారు.

“నువ్వు ఎండలో కందిపోతావని కారు తీసుకు వచ్చాను. నీ సరసని ఇల్లా షికారుగా రావటం నాకు మబ్బుల్లో హంసరెక్కలమీద కూర్చొని విహారించినంత సుఖంగా వుంది.” అని కవిత్వంగా మాట్లాడితే ఆనందంగా వుండేది. కాని గోపాలు “నేను వాచీ బాగుచేయించుకోవటానికే బయలు దేరాను” అని నిర్మొగమాటంగా అనటంతో తారకి ఆ నిజం చేదుగా వుంది. సత్యాసత్యాల అభూత కల్పనతో వూగుతున్న ఆమె మనసుని ఘటనాఘటనలగురించి యోచించగల స్థిమితత్వాన్ని సంతరించుకో లేకపోయింది.

“రేపు తొమ్మిది లోపున కాగితాలు తీసుకురా!”

కారు తమ ఆఫీసుముందు ఆగినట్లు గ్రహించింది తార. కారు ఆగింది.

"మా ఇంటికి వస్తావా ? నేను రావాల్నా ?" తలవూపి లోపలికి నడిచింది తార.

"అరే! ఏమిటీ పిల్ల ? రమ్మంటుందో తను వస్తుందో అర్థంకాకుండా తలూపి వెళ్ళిపోతుందేమిటి ?" అని ఆలోచిస్తూ కారుస్టార్టు చేసాడు గోపాలు అంతగా తొమ్మిదిలోపున ఆమె రాకపోతే తనే వద్దామనుకుని నిర్ణయించుకున్నాడు. తీరా దిగిపోయాక, ఆ చోటంతా ఖాళీగా కన్పించింది గోపాలుకి. ఏమిటో దిగాలు పడింది అతని మనస్సు! నలభయ్ రెండేళ్ళ అతని జీవితం, స్త్రీ స్పర్శ ఎరుగకుండా గడవలేదు. ఆ మాటకొస్తే స్త్రీని కోరకుండగా అతను ఏరోజూ నిద్రపోనే లేదుకూడా! అతని శారీరక దృఢత్వమూ ధనమూ చాలా మంది యువతులకి ఆనందాన్ని అల్పత్వాన్ని కూడా కలిగించింది కాని ఏ యువతినైనా అతను మరుక్షణములో మరిచిపోగలిగేవాడు. అందుకనే అతనికి ఇంట్లో నిరంతరం కనిపెట్టి వుండాల్సిన ఒక స్త్రీ అవసరం అంతగా కలగలేదు. అతని వాణిజ్య దృష్టి స్త్రీవిషయంలో కూడా ఏమీ విస్మృతం కానే లేదు. కాని "తారని గురించి అర్థగంట దాకా ఆలోచించేసరికి గోపాలుకి తనమీద తనకే ఆశ్చర్యం కలిగింది. ఏదో తేజోమయమైన కాంతులు ప్రసరించిన వెలుగు మనసంతా నిండుకుని తృప్తిగా వుంది ఒక వూహ!

ఒక చిన్నపూవు తమ తోటలోకి అకారణంగా

వచ్చింది. ఆ చిన్నపూవుని వసివాడకుండా చూసుకోవాలనే ఆకాంక్ష గోపాలు మనస్సులో చోటు చేసుకుంది. దానితో అతనిమనస్సు ఆమె చుట్టూ పరిభ్రమించసాగింది.

28853

## 5

రాజుకి ఈరోజు బొత్తిగా పని లేదు. తీరుబాటుగా అణా ఇచ్చి అద్దెకి తెచ్చుకున్న డిటెక్టివ్ పుస్తకం చదువు కుంటూ కూర్చున్నాడు. మిగతావాళ్ళు టైపు మిషన్లు టక టక మనిపిస్తూ పనిలో నిమగ్నమయిపోయారు. రాజుని చూడ గానే తారకి తనేదో ఆకాశం అంత ఎత్తున పెరిగిపోయినట్లు భావన వచ్చింది. రాజు ఒక చిన్నపిల్లాడిలా ఆమె కళ్ళకి కన్పించాడు! అతని బల్లదగ్గరకి ఠీవిగా మహారాణిలా నడుస్తూ వెళ్ళింది. గోపాల్ యిచ్చిన కాగితాలు అతని ముందు పడేసి–

"రాజూ! ఈ కాగితాలు ఒక అర్ధగంటలో టైపు చెయ్యాలోయ్! అర్జంటు! వెరీ అర్జంటు!" అన్నది దర్పంగా. రాజు కళ్లు చిట్లించి తారవెంపు చూసాడు.

"అవునోయ్! అర్జంట్!" తమాషాగా కనుబొమ్మలు ఎగరవేసి అంది తార.

"తమ స్వంతమూండీ!" అన్నాడు వినయం ప్రద ర్శిస్తూ.

"కాదోయ్. ఆఫీసువే! నువ్వు వెంటనే టైపుచేసిస్తే సాయంత్రం ఐస్‌క్రీం ఇప్పిస్తాను యించక్కగా?" అంది చిన్న పిల్లలా.

"కమిషన్ ఎంత ఇస్తావు? అసలు ని న్నెవరు చేయ మన్నారు?" అంటూ హాలులోవున్న ఇతర టైపిస్టులవంక చూసాడు. అంతా తలలువంచుకుని ఎవళ్ళపనులు వాళ్లు నిశ్శబ్దంగా చేసుకుంటున్నారు.

"రాజూ అల్లా దిక్కులు చూస్తా వెందుకని? కాస్త సాయితా చేస్తే అరిగిపోతావా?" కోపంగా అంది తార.

"అబ్బే అరిగిపోను. కరిగిపోతాను తారా! నీ ధోరణి ఇల్లా వింతపుంతల్లో ప్రయాణిస్తోందేమిటా అని ఆలోచిస్తు న్నాను. అంతకంటే ఏమీలేదు. ఇన్నాళ్ళూ స్నేహార్ద్రతని ధ్వనించే నీ గొంతు, ఈ రోజున అధికారదర్పం నింపుకున్న దెందుచేతని? నీకు ప్రమోషన్‌గాని వచ్చిందా మానేజరు గారి పి. ఎ.గా? ఇవ్వాళ యిరవయి ఆరో తారీకుకదా, నీ దగ్గర రిష్కాడబ్బులే నిండుకుంటాయికదా! ఐస్‌క్రీంలూ ఫ్రూటు సలాడ్‌లూ ఎల్లా యిప్పించుతావు?" అన్నాడు.

"నీ సైకో ఎనాలిసిస్ తర్వాతకాని ముందు కాస్త ఈ పనిచేసి పెట్టుదూ! వెధవ హస్కాలజీ ప్రొఫెసరువి అయి పోయావు?" అంది.

"జులుం చేస్తోంటే వున్న అభిమానం కాస్తా ఫ్లాస్ట్

అయిపోతుంది. నాకేం?'' అని తెల్లకాగితాలు టైపుమిషన్ లోనికి ఎక్కిస్తూ-

''కాపీలు రెండు చాల్నా?'' అన్నాడు.

''దట్సినఫ్ !'' తల చిన్నగా ఆడించి తనసీట్లోకి వెళ్ళి కూర్చుంది తార.

''హారి నాయనోయ్ ! స్టైల్ పెంచిందే రామ చిలుక !'' అన్నాడు రాజు.

వురిమి చూసింది తార రాజుని.

''పాపం శమించు గాక !'' అని పనిలో నిమగ్న మయ్యాడు రాజుకూడా.

అయిదుగంటలు కొట్టింది గడియారం అలవాటుగా. అందరూ లేచి మానేజర్‌గారి రూములోనికి వెళ్లి సంతకాలు చేసివెళ్ళిపోయారు.హాలంతా ఎప్పటి నిశ్శబ్దము ఆవరించుకుంది. తారమటుకు ముఖమన్నా ఎత్తి చూడకుండా తలవాంచు కుని అదేపనిగా టైపు చేసుకుంటోంది. రాజుకి తారని ఏడి పించాలని కుతూహలం కలిగింది. రాజు ఒక్కసారి తన దగ్గ రున్న కాగితాలు వెరిఫై చేసి చూసుకున్నాడు. నెమ్మదిగా లేచి తార సీటుదగ్గరకు వచ్చాడు.

''తారాదేవిగారూ ! నన్ను మీతో మాట్లాడటానికి కాస్త అనుజ్ఞ ఇస్తారూ ?'' వినయంగా అన్నాడు.

తార ముఖం చిట్లించి తలెత్తింది. ఏమిటన్నట్లు చూసింది. మళ్ళీ తనపనిలోనికి దూరిపోయింది.

''నా పని పూర్తిచేసానండి !'' అన్నాడు రాజు.

"మంచిది సంతోషం" అంది తలెత్తకుండానే.

తారఏకాగ్రత రాజుకి నచ్చలేదు.

"తారా ! ఈ రోజు ఏమిటి ?" అన్నాడు.

"ఏమిటి ?"

"ఏకాదశా !" జ్ఞాపకం వచ్చినట్లు అన్నాడు.

"కాదే !" మామూలుగా అంది.

"వో హో ! మర్చిపోయి వుంటాను. పోలాల అమావాస్య కదూ !" అమాయకంగా అన్నాడు.

"ఛీ ఛీ ! ఇవ్వాళ అమావాస్య ఏమిటి రాజూ ! నీకు మతిపోతోందా! " కసరింది తార.

"తెలిసింది ! తెలిసింది ! క్షమించు ! తారాదేవీ ! క్షమించు! ఈరోజు కార్తీకపౌర్ణమి!" విజయగర్వంగాఅన్నాడు.

"రాజూ నన్ను డిస్టర్బ చేయకు ! పని అయిపోవాలి ఃుందు !" అంది.

"ఆఁహా ఎన్నాళ్ళకి చల్లనిమాట విన్నాను తారా దేవీ ? ఇన్నిరోజులూ నేను పనిచేస్తోంటే 'ఎప్పుడూ పనేనా రాజూ ! కాస్త రిలాక్స్‌గా వుంటుంది. అట్లా పోదాం రద్దూ!' అంటూ నానా గోలా చేసేదానివి. ఇవ్వాళ నా వంతు వచ్చింది. పద పద. టైమెంత అయిందో తెలుసా ? ముందు పని కట్టిపెట్టి లేచి రావాల్సిందే నాతో !" మొండిగా అన్నాడు రాజు.

"టైము ఎక్కడ రాజూ ! వాచీ ఆగిపోయిందిగా !" పరధ్యానంగా అంది తార.

"వాచీ ఎవరిదీ? నీకు వాచీ లేదుగా?" ఆశ్చర్యంగా అన్నాడు రాజు. తారకు కాని, రాజుకి కాని వాచీలే లేవు. అసలు ఆహాలులో పనిచేస్తున్న ఎవరికీ వాచీలు లేవు! వాళ్లందరికీ కాలదర్శిని, ఆ గోడగడియారం ఒక్కటే! అది బహుశా, పదిహేడవ శతాబ్దిదని, పురాతత్వ శాఖవారి అంచనా! గణేష్ మాత్రం, పద్దెనిమిదవ శతాబ్ది చివరి భాగంలో, అప్పటి ఆంగ్లేయ గవర్నర్‌గారు తమ వంశీయులకి రావుబహద్దూర్, మున్నగు బిరుదులతో బాటు బహుమతిగా ఇచ్చారనీ చెప్తోంటాడు. అది ఇంకా వివాదాస్పద విషయంగానే వుంది చరిత్ర కారులకు! నెలకి యాభయ్ రూపాయలు పుచ్చుకుంటూ, పైనభై అయిదురూపాయిల పుచ్చుకుంటున్నట్లు సంతకాలుపెట్టే ఆ మూగయంత్రాలకి కాల నిరూపక యంత్రం వేరే ఎక్కడ్నించి వస్తుంది?

"అవును తారా! నీకు వాచీ ఎక్కడిది? రోడ్డుమీద గానీ దొరికిందా? వాట్ ఎ లక్కీ-గర్ల్ యూ ఆర్! ఇల్లాతే! ఆగిపోయిందా? అయితే పాడయివుంటుంది. రిపేర్ చేయించి పెడతాను. ఏం? చూపెట్టవూ?" అదేపనిగా వేధించడం మొదలుపెట్టాడు. రాజు.

"రాజూ! ఏమిటా వాగడం?" కసరింది తార.

"ఇలేదానివే! కసరుకుంటే వదుల్తాననుకున్నావా? పావలా డబ్బులు ప్రియస్నేహితురాలవి కదా అని స్వతంత్రంగా తీసుకుంటే, దొంగబుద్ధి అని నామీద కేకలేసావే! అట్లాంటిది వాచీకి వాచీ చెక్కేస్తే నేను వూరుకుంటానా?

నీది పెద్దమనుష్యుల లక్షణం అవుతుందా? ఇప్పుడే పోలీసులకి రిపోర్టు ఇచ్చేస్తాను." దుర్గగా అన్నాడు. తార వచ్చేనవ్వుని ఆపుకుందుకు ప్రయత్నిస్తూ..

"ఏమని రిపోర్టు చేస్తావు రాజూ?" అంది.

"ఏమనా? ఏమనంటే గణేష్, టైపుఇన్‌స్టిట్యూట్‌లోని గర్ల్ టైపిస్టు అయిన మిస్. తారాదేవికి, నేటి మధ్యాహ్నం ఒంటిగంట గంటన్నర ప్రాంతంలో నడిరోడ్డుమీద మిల మిల మెరిసే రిస్టువాచీ ఇరవయ్ ఒక్క జ్యూయల్సతో, డేటు కూడా వున్నది దొరికినది. కావున సదరు వాచీ స్వంత దారులు వచ్చి ఆ వాచీ తమదని రుజువు చేసికొన్నయడల వాచీ హ స్తగతము చేయబడును.

ఇట్లు,
కుమారి తారాదేవి తరపున,
మిస్టర్ రాజ్.

ఎలా వుందీ?" అన్నాడు.

"నీ ముఖంలానే వుంది! వెర్రి నాతండ్రీ! అసలు నాకు వాచీ దొరికిందని రూఢి ఏమిటి నీకు?"

"అయితే ఇంతకీ వాచీ దొరకలేదా? మరేం దొరికింది?" బిక్కగా అన్నాడు. రాజు.

"ఏదో వకటి దొరికివుండాలన్నమాట! పోనీ రాజూ! వాచీయే దొరకాలా ఏమిటి? వాచీవున్న మనిషి దొరికితే ఛాలదా?" గోముగా అంది.

"చాలుతుంది! నిక్షేపంగా చాలుతుంది. కాని మని షెలా దొరుకుతాడు? ఆఁ! అమ్మబాబోయ్? నిజమే? ఖూనీ, ఖూనీ! అంటే మర్డర్! హంతకుడు! పోలీసులు!" అదిరిపోయాడు రాజు.

"రాజూ! వెర్రెత్తిందా చిట్టితండ్రీ. ఏమిటా పొలి కేకలు?" లాలనగా అంది నవ్వుతూ తార.

"ఇంకా వెర్రి అని నెమ్మదిగా అంటున్నావా తారా? నీకు వాచీ వున్నమనిషి నడిరోడ్డుమీద దొరికాడన్నావు! ఎల్లా దొరికాడు? దొరికిన మనిషి ఏ స్థితిలో వున్నాడు? దీనికి షెర్లాక్ హోమ్సు దాకా కావాలా? బ్రతికున్న మని షైతే, తన చేతినున్న వాచీ నిన్ను తీసుకోనిస్తాడా? ఆ మని షిని ఎవరో హత్యచేసి రోడ్డుమీద పడేసి వుంటారు. నువ్వు వస్తూ, అతని చేతినున్న వాచీని చూసావు! ఎల్లానూ చచ్చి పోయేడుకదా అని వాచీని నువ్వు తీసుకున్నావు? తారా మైడియర్! నిన్ను ఇప్పుడు ఆ బ్రహ్మదేముడు కూడా తప్పించలేడు! నీ వేలిముద్రలు నిశ్చయంగా ఆ శవం చేతి మీద పడుంటాయ్! అసలు హంతకుడు ఏ కిటికీలోంచో నిన్ను గమనిస్తోనే వుంటాడు. నిన్ను వెంబడిస్తాడు! నీ ఆచూకీ గుర్తుంచుకుని, ఈ సరికి పోలీసులకి రిపోర్టు ఇస్తాడు. అందమైన అమ్మాయిలని సెంట్రల్ ఇంటిల్‌జెన్స్ డిపార్టు మెంటువారు అస్సలు నమ్మరు ఎల్లా తారా! ఆ హంత కుడు హత్యని ఎదుటివారిమీద తోయాలనే వుద్దేశ్యంతోనే

వాచీ తీసివుండడు. వాడు పన్నిన ఉచ్చులో ఉడతలా ఇరుకున్నావు !" భయంగా అన్నాడు. రాజు.

తారకి పొంగి పొంగి వస్తోన్న నవ్వుని ఆపుచేసుకోటం బహుకష్టంగావుంది. అయినా ముఖం సీరియస్‌గా పెట్టగలిగింది.

"రాజూ ! ఈ అపాయంలోంచి నువ్వే తప్పించాలి రాజూ ! ఏదో సరదాకి తీసుకున్నాను ! ఇంత అగాధంలో పడ్తాననుకోలేదు. ఎల్లా రాజూ ? నిజంగా ఆ హంతకుడు కారులో నన్ను వెనుకాడటంకూడ లీలగా గుర్తు వస్తోంది. అతనివల్ల నా మనస్సంతా తీరని ఆవేదనకి లోనయిపోతోంది. అతను జ్ఞాపకం వచ్చినక్షణం, నాతల భయంతో బ్రద్దలయిపోతున్నంత భాధగా వుంది రాజూ ! తప్పదు రాజూ ! ఈ విపత్తులోంచి నువ్వే నన్ను రక్షించాలి ! నీకంటే నాకు ఈ లోకంలో ఆప్తులెవరున్నారు చెప్పు !" బిక్కగా సజలనయినాలతో అంది తార.

ఈ లోపున గణేష్ ఇవతలకి వచ్చాడు. బిక్కముఖం వేసిన తారనీ సీరియస్‌గా ఆలోచిస్తున్నట్లున్న రాజునీ చూసాడు. దగ్గర దగ్గర ఏడుగంట లవ వచ్చింది. ఇద్దరూ ఇంకా ఆఫీసుని వదలకపోవటం ఆయనకి కొత్తగా వుంది. వాళ్ళ దగ్గరగా వచ్చాడు టేబులుమీద జి జి. రాం అండు కో వాళ్ళ కాగితాలు రెపరెప లాడుతున్నాయి. హాలంతా సంజ చీకట్లు అలముకున్నాయి. ఆ చీకట్లలో నిండుతూన్న

హాలులో తార లేతగులాబీ చీరమటుకు స్పష్టంగా కన్పించు తోంది.

"ఏమయింది మీకు? అల్లాకూర్చున్నారేం? ఇంకా అందరితోపాటు వెళ్ళిపోయారనుకున్నాను నేను!" హాలులో లైటువేస్తూ అన్నాడు. తార గమ్మున ముఖానున్న విషాదం చెరిపేసుకుని చిరునవ్వుని ముఖానికి పూసుకుని-

"ఏం లేదుసార్! ఇవ్వాళమధ్యాహ్నంనించీ రాజుకి పనేమీలేదుట! తీరిగ్గా డిటెక్టివ్ నవలలు చదివి అవి నా దగ్గర నెమరువేస్తున్నాడు. నన్ను జి. జి. రాం గారు టైపు చేయమని కొన్ని కాగితాలు ఇచ్చారు. అవి నేను చూసు కుంటుంటే ఒకటే గొడవ చేస్తున్నాడు?" అంది.

"ఏమిటి రాజూ చిన్నపిల్లవాడిలా అల్లరిచేస్తావ్? కాస్త సహాయం చేయటం పోయి పైగా డిస్టర్బ చేస్తావా? ఇద్దరూ కలసి వాళ్ళ కాగితాలు పూర్తిచేసెయ్యండి! అసలే సణుగుతున్నాడు టైంకి అందటం లేదని! చూడు తారా! రేపు రమ సెలవుపెట్టింది. నన్ను అయిదురూపాయిలు అడి గింది. వెళ్ళేటప్పుడు ఇచ్చివెళ్ళు!" అయిదురూపాయలూ బల్లమీదపెట్టి వెళ్ళిపోయాడు గణేశయ్యర్.

## 6

"ఎవరికోసం?"

నెత్తితగలకుండా చిన్నదిడ్డి గుమ్మంలా వున్న కంత లోంచి వంగి లోపలికి వచ్చిన తారని నిలువునా పరీక్షించి చూస్తూ అడిగాడు జోగప్ప.

"రమగారికోసరం" అంది తార. ఆ చిన్నగది అంతా వేయికళ్ళతో అరనిమిషంలో చూసి రమ పరిస్థితినంతా అవగాహన చేసుకుంది. ఆమె ఒకగోడని అద్దం, అడ్డదిడ్డంగా బీటలువేసిన దంపతుల ఫొటో ఒకటివుంది. బహుశా అది రమ పెళ్ళినాటిదయి వుంటుంది. జోగప్ప బీడీ కాలుస్తూ చిన్న చిరిగిన ఈతాకులచాపమీద, పాతబడిన పేకముక్క-లతో పేషన్సు ఆడుకుంటున్నాడు. ఎదురుగావున్న గోడవార చిన్న బొంతని వళ్ళంతా చుట్టుకుంటూ, లక్క-గిలకాయని నోటిలో పెట్టుకుని మ్రింగబోతూ, వూఁ వూఁ అంటూ డేకు తోంది నాలుగునెల్ల పాప! ఆ గిలకాయ ఎర్రనిరంగు పాప పెదాలకు అంటుకుని చొంగలో కలిసి గడ్డంనిండా కారు తోంది. పద్నాలుగేళ్ళ అమ్మాయి కుంపటిమీద చిన్న గిన్నెతో ఏదో పెట్టి విసురుతూ కూర్చుంది. తారని చూసి-

"అల్లా కూర్చోండి! అక్క- ఇప్పుడే వస్తుంది"అంది. వినయంగా వుంది ఆ అమ్మాయి తీరు. తార గడపమీద కూర్చుంది.

"ఒక ఆటవేద్దామేమిటోయి!" అన్నాడు జోగప్ప. తార ఉలిక్కి-పడి అతనివెంపు చూసింది. ఎర్రగా పెద్దగా వున్నాయి జోగప్పకళ్ళు. గళ్ళలుంగీ, తెల్లని బనీనూ వేసు

కున్నాడు. పల్చని బనీను జేబులోంచి బీడీలకట్ట కన్పడు తోంది.

"నాకు పేక ఆటరాదు !" నమ్రతగా అంది తార.

"మరేం వొచ్చు ? డాన్సొచ్చా!" అన్నాడు జోగప్ప కళ్ళు పైకెత్తి.

"అదీ రాదండీ !" అంది తార.

"ఆవిడ అక్క ఆఫీసులో పని చేస్తున్నారు" అంది ఆ అమ్మాయి.

"వోహ్ ! టైపిస్టువా ! ఫరవాలే. పనికివొస్తావు ! ఆ కాటగిరీకి చెందినవాళ్ళే ఇప్పుడు పైకి వస్తున్న అమ్మాయి లంతా ! చూడు ! నువ్వు చాలా బాగున్నావు ! నిజానికి మా రమకంటేకూడా బాగా ముద్దొచ్చేలా వున్నావు ! వెధవ టైపు పగలల్లా రెక్కలు ముక్కలుచేసుకుని కొట్టాలి ! నెల పొడుగూతా రెక్కలు కొట్టుకుంటే వచ్చేవి సరిగ్గా వంద రూపాయలుండవ్ ! రమిమ్మలో బ్లైండు వెయ్యటానికికూడా చాలవ్ ! వెధవ కష్టార్జితం ! మా మట్టిముద్ద రమ వుండే అది వొట్టి దరిద్ర దేవత ! 'కష్టార్జితం కలకాలం నిలుస్తుంది నీతి వుండాలి కానీ' అంటుంది. ఏదీ ! ఎక్కడన్నా రాగిపైసా నిలచిందా ? రేషను కొనేటందుకే చాలటంలేదు ! ఆమె గారి నీతివంతమైన కష్టార్జితం ! క్లబ్బులో చేరవే మొఖమాం అంటే వొప్పుకోదు ! ఆఁహా ! మాటవరసకి చెప్తాను అమ్మాయి ! వినకపోతే ఎవడేం చేస్తాడు ! మా క్లబ్బులో వుండే ! కన్ను కదిపితే కనక రాసులు జలజల రాల్తాయి !

ఏమిటో గౌరవంట! మర్యాదాట! కడుపు కాల్తోంటే గౌరవ మర్యాదలు అన్నం పెడుతున్నాయా? మన నీతి చూసి ఎవరైనా మాన్యాలు వ్రాసిస్తారా? వాళ్ళకి ఏమీ వుపయోగపడకుండా, ఏ మహారాజు దానం చేయగలడూ ?" హితబోధ చేస్తున్నవాడల్లే అన్నాడు.

"అంతేనండి!" ఏమనాలో తోచక అంది తార.

"అద్దదీ. తెలివైన పిల్లదానవు! పైకి వస్తావు తప్పకుండా! పేకాట వుంది చూడు! ఓడిపోయినకొద్దీ పౌరుషం పెరిగిపోతుంది. నేను మెట్రిక్ పరీక్షకి పదిహేనుసార్లు కట్టాను. పరీక్ష పోయేది. కించిత్తూ బాధవుండేదికాదు మళ్ళీ రెట్టింపు ఫీజుకట్టి పరీక్షలకి హాజరయ్యేవాణ్ణి!"

నిర్ఘాంతపోయింది తార!

"బయటికి వెళ్ళిపోండి! బావకి నిషా ఎక్కువ అయిపోతుంది!" ప్రార్ధనగా అంది. ఆ అమ్మాయి.

"రమ భర్తా ఈయన!" ఆశ్చర్యపోయింది.

"ఇప్పుడే బయటికి పోయివచ్చాడు. నాలుగు డబ్బులు కనిపిస్తేచాలున్న! తాగేసి వస్తాడు" సిగ్గుతో కుంచించుకపోతూ చెప్పింది ఆతని పరిస్థితి! ఆ పిల్లదాని వెంపు చూసింది తార. అచ్చు రమలానేవుంది. ఆ అమ్మాయి! గుండ్రని ముఖము, తీర్చిదిద్దిన కనుముక్కు తీరువా, నుదుట నయాపైసంత అగరుబొట్టూ, కళ్ళనిండుకూ కాటుకా వెలిసిపోయిన పాత చీరగుడ్డ వోణీ, చీటీపువ్వుల పరికిణీ ధరించిన ఆ అమ్మాయి ముద్దుగా వుంది! లేతవయసులో

వున్న ఆ అమ్మాయికి ఎక్కువ అందాన్ని తెచ్చిపెట్టింది ఆ అమ్మాయి పొడుగాటి జడ !

"నటన మాడవే మయూరీ... ... ..." అరకు క్రీన్ ముక్క కళ్ళదగ్గరగా పెట్టుకుని పాడుతున్నాడు జోగప్ప.

"మీా అక్కకి ఈ అయిదు రూపాయిలూ ఇయ్యి ! మానేజర్‌గారు ఇమ్మన్నారు" అని లేచింది తార.

"పోవుచున్నావా ప్రియతమా ! ఈ అగాధాల నిస్తబ్దంలో ఏకాకిగా, జడుడుగా పడివుండమని శపించి, నీమటుకు నీవు నింగిలోని నీలాల జలదాల వుద్భవించి, ప్రభవించుతూన్న తారకల్ని, నీ ముద్దు అలకల్లోని జాజులుగా ముడుచుకుని, మురిసిపోయేందుకు మబ్బుల్లో తేలిపోతున్నావా ? నేను నిన్ను వదలను ! తూ మేరీ ఘటా! మై తేరీసావన్ !" అంటూ గమ్మున లేచినించున్నాడు. తార హృదయం దడదడలాడింది. శరీరం జలదరించింది. చటుక్కున లేచినించుని దొడ్డిగుమ్మం ద్వారా బయటకు పోబోయింది. గుమ్మం నెత్తికి కొట్టుకుంది. కళ్ళమ్మట నీళ్ళు వచ్చాయి. తల బాధగా దిమ్మెక్కిపోయింది. మెదడంతా కాలంకారంగా అయి పాలమారింది ఎల్లానో రోడ్డుమీాదపడి నడిచేసింది.

"ఏమండమ్మాయిగోరూ !" అన్న వెంకన్న పలకరింపుకుకాసీ, తారకి తను గోపాలరాం ఇంటికి వచ్చినట్లు తెలీదు. ఒక్కసారి తలవిదిలించి చూసింది. నిజమే ! తను గోపాలరాం ఇంటికి వచ్చేసింది. ఆశ్చర్యం ! ఎందుకువచ్చి

నట్లు ! తనలో తనే మల్లాగుల్లాలు పడుతూ నిలబడిపోయింది తార !

"ఏమండీ" మళ్ళీ అడిగాడు వెంకన్న. ఇహ అప్పుడు తేరుకుంది. తార ఏదో వకటి జబాబు చెప్పాలికదా అని-

"అయ్యగారు ! లేరా?" అంది.

"వున్నారు: భోజనం చేస్తున్నారల్లేవుంది. కూర్చోండి !" అని లోపలికి వెళ్లాడు వెంకన్న "అయ్యగారు ఇంట్లో లేరు అని చెప్పివుంటే బాగుండును!" అనుకుంది. తార ! చేతుల్లో కాగితాలు లేవు ! సరాసరి రమ ఇంటినించి అనాలోచితంగా ఇక్కడికి వచ్చేసింది తార. గాభరాగా అటూ ఇటూ చూస్తూ నించుంది. ఇంట్లో వున్నాడని తెలిసాక చూడకుండా వెళ్ళిపోతే బాగుండదు ! ఎందుకు వచ్చావని అడుగుతే ఏమని చెబుతుంది? తార గబగబా బయటికి వెళ్ళి నడవసాగింది. ఆఫీసుకి వెళ్ళి ఫైలుసతీసి, గోపాలరాం కాగితాలు తీసింది. ఇంకాసగం టైపుచేయాలున్నవి వున్నాయి! అందులో నిమగ్నమయిపోయింది సాయంత్రం ఏడుగంటల దాకా. ఆ రోజు రాజుకి తారమీద బాగాకోపంవచ్చింది. పెద్ద పనిమంతురాలల్లే తనవంకన్నా చూడకుండా తార పని చేసుకపోవటం రాజుకు ఎంతమాత్రం నచ్చలేదు. అంచేత సాయంత్రం అయిదు కాగానే తనమటుకు తను తారతో మాటకన్నా చెప్పపెట్టకుండా వెళ్ళిపోయాడు. అది తార గ్రహించలేదు. ఆమె జి. జి. రాం ఫైలుని, అన్ని

పూర్తిచేసి తలెత్తేసరికి ఏడుగంటలు దాటింది. గణేష్ దగ్గరగావచ్చి ప్రేమగా అన్నాడు.

"ఏమ్మా! రాజుకూడా వెళ్ళిపోయాడే! నువ్వుండిపోయావేం?"

"గోపాలంగారి అర్జంటు కాగితాలు పూర్తిచేసాను సార్" అంది వుత్సాహంగా.

"గుడ్ గర్ల్! డేవిడ్ చేత పంపిస్తానులే. నువ్వు ఇంటికి వెళ్ళు! రాత్రయిపోయింది, పాపం! రాజుకూడా సాయం లేడు ఈ రోజు! వుత్త తిక్క-శంకరరాయి! రాజు!" అన్నాడు.

"నేను పట్టుకవెళ్ళి ఇచ్చేస్తానుసార్!" అంది తార.

"నువ్వే వెళతావా? ఎందుకమ్మా అంతదూరం?" గోపాలరాం ఇంటికి తార వెళ్తాననటం గణేష్కి అంతగా నచ్చలేదు.

"ఫరవాలేదు సార్ వెళ్ళగలను."

ఈ సారి నిర్భయంగా గోపాలరాం ఇంటి హాలులో నిలబడి నాలుగు వెంపులా చూసింది తార. గోడమీద వున్న గడియారం ఎనిమిదిగంటలు చూపుతోంది. ఇంటిలో ఎక్కడా సందడిలేదు ఇల్లంతా నిశ్శబ్దకాంతిని నింపుకుంది! ఇంతపెద్ద మహల్లాంటి భవనంలో గోపాలరాం ఎక్కడ వుంటాడో ఆమె వూహకి అంతుపట్టటంలేదు. హాలుగోడలు పరీక్షిస్తూ మెత్తటి తివాసీమీద పచార్లు చేయసాగింది.

తార! వేలువేస్తే జారిపోయే నున్నటి పాలరాతి గోడమీద జాలువారే తన నీడను చూస్తున్నది తార.

"ఎవరది? నువ్వా! ఎందుకు?" అన్నాడు గోపాలరాం. వెనక్కి తిరిగిచూసింది! మేడపై మెట్టుమీద నిలబడినాడు గోపాలరాం. ఎందుకో చెప్పలేని లజ్జ కలిగింది ఒక్కసారిగా తారకి! గులాబీరేకల పెదాలు అదురుతూంటే నింపాదిగా—

"ఇవిగో మీ కాగితాలు! ఇంకేవీ అవసరమైనవి లేవుగా!" అంది.

"ప్రస్తుతం లేవులే! ఎక్కణ్ణించి వొస్తున్నావ్!" అన్నాడు?

"ఆఫీసునుంచే!"

"ఆఫీసునించా!" వాచీ చూసుకున్నాడు ఎనిమిదిన్నరయింది.

"భోజనం చేయలేదుకదూ! నేనూ ఇంకాచేయలేదు! దా, భోజనంచేసి వెళ్లుదువుగాని!" ఆప్యాయంగా అన్నాడు. తార గాభరాపడిపోయింది.

"వొద్దు వొద్దు. వెళ్ళిపోతాను" అంది.

"ఫరవాలేదు! నాతోపాటుగా తిందువుగాని" ఆపేక్షగా అన్నాడు. తార శరీరం ద్రవించిపోతోంది. పాలల్లా మనసంతా తెలీని సంతోషంతో పొంగిపోతోంది! ఆమె స్కూలుఫయినల్ దాకా సేవాసదన్‌లో వుంటూచదువుకుంది. ఏదో మెస్‌లో వేళయినప్పుడు తొంబలో వెళ్లి భోజనం చేసి

రావటం తప్ప యింత ఆదరపూర్వక ఆహ్వానం ఆమె కెన్నడూ లభించలేదు. ఆప్యాయత అనేది మానవ హృదయాలని స్పందింపచేయటం తారకి మొట్టమొదటిసారిగ అనుభవంలోనికి వచ్చింది. ముఖమంతా కళ్ళు విప్పుకుని ఆశ్చర్యంగా జి. జి. రాం వెంపు చూసింది.

"వెంకా! రెండు భోజనాలు తెమ్మను నాయర్‌తో!" అన్నాడు.

"వొద్దండీ!" అంది నమ్రతగా-

"నా ఆతిథ్యం స్వీకరించకూడదా!"

"అదేం లేదు!"

"అయితే పద! ఆలోచనెందుకు మరి?" పైకి వెళ్ళారు. టేబుల్ మీదవున్న పాలరాతి శిల్పాన్ని చేతుల్లోనికి తీసుకుని మళ్ళీ యథాప్రకారం టేబుల్ మీద వుంచేసాడు. వెంకన్న రెండు టర్కిష్ నాప్‌కిన్స్ తెచ్చి ఇచ్చాడు. నాయర్ ప్లేట్లలో భోజనం పెట్టుకుని తీసుకు వచ్చాడు. ఇద్దరూ మౌనంగా భోజనం ముగించారు. ఇద్దరికి చెరో మిఠాయికిళ్ళీ తెచ్చాడు నాయర్. అవి తీసుకుని క్రిందకు దిగివొచ్చారు. తార గేటులోకి వచ్చి నిలబడింది. కడుపునిండా భోజనం చేయటంవల్ల చల్లగా మత్తుగా వుంది. అంతకంటే చల్లగా మత్తుగా నింగిమీద జాబిలి నవ్వుతూ కదుల్తున్నాడు. నెమ్మదిగా గదికి చేరాలి అనుకుంది తార. హఠాత్తుగా ఆమెకి రాజు జ్ఞాపకం వొచ్చాడు. సముద్రం వొడ్డున బఠాణీలు తింటూ తన రాకకోసం ఎదురు చూస్తో వుండో

చ్చును. ఇప్పుడు వెళ్ళాలంటే మళ్ళీ ఎగువకి వెళ్ళాలి. తనకి కళ్ళమీద నిద్ర ముంచుకవస్తోంది. అంచేత ఆమె సముద్రం వొడ్డుకి వెళ్ళటం మానేసి తనువుండే ఇంటికేసే నడవాలను కుంది. మళ్ళీ రా జేమన్నా అనుకుంటాడేమో అన్న అభి మానం మనస్సుని కుదుపుతోంది. అతను వుద్యోగంలో జేరినది మొదలు ఇప్పటిదాకా కలి మెలిసి తిరిగారు. యే పనన్నా ఒకరితో చెప్పకుండా ఇంకొకరు చేసేవారు కాదు. ఈ ఆరునెల్ల సహజీవనంలోనూ, ఇవ్వాళనించీ మొదటిసారిగా విభేదం ఏర్పడింది. అది ఆమెకీ అయిష్టతగానే వుంది, కాని ఏమిచేయటానికీ తోచటంలేదు. ఎంతవద్దనుకున్నా రాజు చిలిపిముఖం, జాలికొలిపే తళుకు కన్నులు ఆమె గుండెలని పిండేస్తున్నాయి. అన్యమనస్కంగా నిండిపోయిన తారని-

నిలబడి పోయావేం ?" అని అడిగాడు గోపాలరాం.

"యింటికి వెళ్ళాలని ఆలోచిస్తున్నా !" తన్ని అతను కనిపెట్టున్నాడన్న భావనరాగానే శరీరం జలదరించింది.

"అల్లాగా !" నెమ్మదిగా వెనుదిరిగి తోటలోనికి నడుచుకుంటున్న గోపాలరాం అన్నాడు.

మధ్యాహ్నంలా కారు తీసుకవస్తాడేమో అని ఎదురు చూసింది తార. కాని గోపాలరాం తోటలోని ఫౌంటెన్స్ దగ్గరవున్న సిమెంటు బెంచీమీద కూర్చుని ట్రాన్సిస్టర్ వింటూవుండిపోయాడు.

# 7

వారం రోజులుగా తార అన్యమనస్కంగా వుండి పోవటం రాజు గమనించాడు ఎంచేత తార అంత వుదాసీనంగా వుండిపోతోందో అతనికి అంతు పట్టటం లేదు. తనకి కూడా చెప్పకుండా దాచుకున్న ఆమె హృదయగత స్మృతులేవో ఆమెను బలీయంగా పట్టిపట్టి వేదన పెట్టున్నాయని గ్రహించాడు. తాను ఆమెని చిరకాల స్నేహితుడుగా ఆమెలోని ఏ వేదనన్నా పారద్రోలగలిగితే తన జీవితంలో తను కూడా ఒక ఘనకార్యం చేయగలిగిన వాడుగా భావించుకోవచ్చును అని తారతో దగ్గరగా మాట్లాడే అవకాశంకోసం చూస్తూ ఆఫీసునించి తార బయలుదేరగానే వెనకాలే తనూ బయలు దేరాడు.

తార తన యింటికేసి మళ్ళటం చూసాడు.

"ఇంటికి వెళ్ళిపోతున్నావేం తారా! బీచ్‌కి రాకూడదూ!" తారవంచుకున్న తలెత్తకుండా మౌనంగా నిలబడి పోయింది, రాజు ప్రశ్నకి జవాబు ఈయలేదు.

"ఏమిటి తారా ఈ నిశ్శబ్దం! ఈ మౌనం నాతో చెప్పకూడదనిదా? పోన్లే!"

తార గొంతు సవరించుకుంది.

"అది కాదు రాజూ! తలనొప్పిగావుంది. ఇంటికిపోయి కాస్సేపు నిద్రపోదామని?" అంటూనే రాజుముఖంకేసి

చూసింది. రాజుముఖం చిన్నపిల్లాడి ముఖంలా, తల్లి ఎందుకు కొట్టిందో తెలియనంత అమాయంగా కన్పించింది ఆమెకి.

"ఎన్నిసార్లు నాకు తలనొప్పిగా వుంది బాబూ అంటూంటే సముద్ర గాలి తగిలితే తలనొప్పి పోతుందని బల వంతంచేసి తీసుకపోలేదు తారా! పోన్లే! నువ్వేదో ఈ వారంరోజులుగా నాతో మాట్లాడటమే లేదు సరిగ్గా! ఎందు కనో నన్ను తప్పించుకతిరగాలని చూస్తున్నావు! నే నెప్పు డయినా, నీ పట్ల అనుచితంగా ప్రవర్తించానా తారా! అల్లా అయితే సర్వదా క్షంతవ్యుణ్ని!"

"ఛాఛా అదేమిటి రాజూ!" తార విచలిత య్యింది. కళ్ళనీళ్ళు నిండాయ్! ఏమీ జరగలేదు. నిజంగా ఏమీ జరగలేదు. వృత్తికుత్తినే తనకు తానే లేని పోనివి కల్పించుకుని బాధపడుతోంది. తన ప్రియమిత్రుణ్ని కూడా వేదన పెడుతోంది. కళ్ళుతుడుచుకుంది.

"మరయితే నా పట్ల ఈ ముభావం దేనికి? అసలు సముద్రతీరం లోని మనోహరత ఎన్నిరోజులయినా నూతనంగా వుంటుందని మురిపించేదానివే! అప్పుడే నీకు ఎక్కువ మయిపోయిందా ప్రకృతి రమణీయకత! ఎందుకుతారా అబద్ధాలలో దాగటం! ప్లైన్‌గా చెప్పకూడదా నీ బాధే మిటో! ఎవళ్ళకి వాళ్ళం ఇంకోళ్ళకి లోబడిపోయినట్లు నిజా లని దాచటం శరీరారోగ్యానికి అనర్థహేతువు అవుతుంది." అన్నాడు రాజు.

"ఏం చెప్పేది రాజూ! ఏమీ లేదు! నిజంగా నాతో
డుగా ఏమీ లేదు. అసంభవమయినదాన్ని సంభవముగా
వూహించి ఎల్లా చెప్పను రాజూ!" అంది తార నిర్వేదంగా.

"చాలా చిత్రంగా మారిపోయావ్ తారా? చాలా
చిత్రంగా మారిపోయావు. నీ కళ్ళు ఏవో ఏవేవో స్వప్నా
లను చూస్తున్నాయి. నా వూహాల కందని ఎత్తుల్లో విహ
రిస్తున్నావు! విష్ యూ గుడ్ లక్! మైడియర్ లిటిల్ గర్ల్!"
వెనుకకు తిరిగి గబగబా జనసమ్మర్దంలో కలిసిపోయాడు
రాజు.

తార వంటిగా రోడ్డుమీద నిలబడిపోయింది. రాజు
అన్నదేమిటో తారకి అర్థం అవలేదు. ఏదో అనూహ్యమైన
శక్తి ఆమెని లోబరుచుకుంది. రాజుతో మునుపట్లా సరదాగా
మాట్లాడడానికి భయమెందుకు? అతనికి ఏదో అపచారం
చేసినట్లుగా తన కీ అమితవ్యథ ఏమిటి? కాదు కాదు. తను
మునుపట్లా తేలిగ్గా ఆడే, పాడే, బాధ్యతలేని, అమాయిక
బాలిక కాదు. ఇప్పుడు తనొక పరిపూర్ణమయిన యువతి.
తనకి ప్రేమించటం తెలిసింది. అలభ్యమైన ప్రేమకోసరం
తహతహ పడటం తెలిసింది. ఈ అవ్యక్త మధురబాధనించి
తను బుద్ధిపూర్వకంగా బయటపడలేదు. పడదుకూడా!
కాని దీనివల్ల లోకంలో తను వ్యక్తిగా నిలబడ్డప్పటినుంచీ,
ప్రియబంధువుగా భావించుకుంటున్న రాజుని దూరం చేసు
కుంటుందా? ఆమె అలసిన మనస్సు మొద్దుబారిపోతోంది.

"ఇంటికేనా?" ఆమె ప్రక్కగా కారు ఆపి కారు

లోంచి బయటికి చూస్తూ అడిగిన గోపాలరాం ప్రశ్నకి ఆమె అనాలోచితంగా జవాబు చెప్పింది.

"ఏమో! నా గమ్యం నాకే తెలియటంలేదు" ఎవ్వరితో ఈ మాటలంటోందో ఆమెకి తెలీలేదు. తార వేదాంతం వింటే గోపాలరాంకి నవ్వు వొచ్చింది.

"ఏం? వుద్యోగం పోయిందా?" అనునయంగా అడిగాడు. గోపాలువెంపు దిగ్భ్రమగా చూసింది తార.

"మీరా?"

"ఏం? అల్లావున్నావు దిగులుగా?"

"ఛ! నే నెల్లావున్నాను!" బింకంగా అంది తార.

"వెయ్యి రూపాయల పర్సు పోగొట్టుకున్న వాళ్ళు, వుద్యోగం పోగొట్టుకున్నవాళ్ళు, దొంగతనం చేసి పట్టుపడ్డ వాళ్ళు, ప్రాణాధికంగా ప్రేమించిన ప్రియులకి దూరమయిన వాళ్ళు" గోపాలరాం దండకంచదువుతూంటే తారకి ఫక్కుమని నవ్వొచ్చింది. రాజు నిష్క్రమణతో ఆవహించిన విషాదాన్ని గోపాల్ ఉల్లాసపూరిత వాగ్ధోరణి పోగొట్టింది. చెట్టంత మనిషి తన్ని సర్వదా కన్నుల్లో దాచుకుంటే బాగుండు ననిపించింది తారకి.

"భలేగా అంటున్నారే! ఏదన్నా తెలుగు సినిమాలకి డైలాగ్స్ వ్రాస్తున్నారా ఏమిటి?" కిలకిల నవ్వుతూ అంది.

"వ్రాయటమేం ఖర్మ! నిన్ను హీరోయిన్‌గా వుంచి సినిమా నేనే తీద్దామనుంది."

చటుక్కున తార ముఖం గంభీరముద్ర దాల్చింది.

"నా ముఖానికి సినీమాతార నవటం కూడానా ?"

"నీముఖానికేం తారా ? నిక్షేపంలాంటి ముఖం ! ఆ చంద్రుడే నీముఖాన్నిచూసి ఈర్ష్యచెంది, ఎల్లా గంట్లు పెట్టుకున్నాడో చూడు !" అంతకన్నా కవిత్వం రాక బుర్ర గోక్కున్నాడు.

"నిజంగా !" అనేసి నాలిక్కరుచుకుంది తార.

"నిజంగానే తారా ! ఇంకా అడగాల్నా ! ఏనాడో మహారాజవంశీకురాలివై వుంటావు ! మహారాజ్ఞి కుండాల్సిన సొగసంతా నీలో కాంతివంతగా కనిపించుతోంది. కాని ఒకటిమటుకు దృఢంగా నమ్ముతున్నాను."

"ఏమిటి ?" ఆదుర్దాగా అడిగింది తార.

"నా కోసరం, ఒక్క నా కోసరమే భగవంతుడు ఈ కలియుగంలో మహారాజులని సృష్టించటం మానుకున్నాడు. తారా !" మెత్తగా కళ్ళువాల్చి నవ్వాడు.

తారకేమీ అర్థంకాలేదు. నెమ్మదిగా పేవుమెంటు మీదకు ఎక్కి నడవబోయింది.

"వెళ్ళిపోకు తారా ! నీకు లిఫ్టియిద్దామనుకుంటున్నా !" అభ్యర్థించాడు గోపాలరాం.

వెనక్కి తిరిగింది. వెనకసీటులోనికి ఎక్కి తెల్లకుందేలు పిల్లలా ముడుచుకు కూర్చుంది. కారు స్టార్టుచేయబోతూ, "మీ ఇల్లెక్కడ ?" అన్నాడు.

"పాస్టర్ పేట అందులో......"

"అందాకా మాఇంటికి తీసుకవెళ్తాను ఏం ?" ముద్దుగా అడిగాడు.

"మీ ఇష్టం" అంది తార.

కారు జోరెక్కింది. అందాకా స్ట్రీట్ లైటు స్తంభా న్నానుకుని నించున్న 'జోగప్ప' సగం కాల్చిన బీడీని నేల మీదకు విసిరికొట్టి రెండుచేతులతో గుండెలు బాదుకుంటూ "పయనమయ్యే ప్రియతమా, నను మరచిపోకుమా !" అంటూ కారు వెనకాతల పరుగెట్టటం ప్రారంభించాడు. ట్రాఫిక్ కానిస్టేబుల్ గబుక్కున ఇది చూచి, జోగప్ప వెనకాతల పరుగెత్తాడు.

# 8

ఆకాశం నిర్మలంగా తారమనసులా, తార మనసు నిర్మలముగా ఆకాశంలా వుంది. ప్రస్తుతం తార మనో దర్పణం ముందు గోపాలరాంయొక్క ధనలక్ష్మీనీడలు ఉజ్వ లంగా నృత్యం చేస్తున్నాయి. చంద్రుడు పదహారు కళలూ నింపుకున్నాక తారయొక్క ముఖ సౌందర్యాన్ని సవాలు చేస్తున్నాడు! గార్డెన్‌లోని ప్రతి చెట్టూ ఏ వేవో పూలు పూసి, తమ సోయగాన్ని సౌరభాన్ని ప్రదర్శించుకుంటూ వెన్నెట్లో మురుస్తున్నది. తార అల్లాంటి భవంతినీ, అల్లాంటి

ధనిక వ్యక్తినీ, సినిమాల్లో చూసింది తప్ప నిత్య జీవితాను భవంలో చూసి ఎరుగదు. సర్వ సాధారణంగా సినిమాల్లో గొప్ప జమీందారు పనిచేసే పిల్లని ప్రేమించటం, ఆ ప్రేమ సాఫల్యతకోసరం అష్టకష్టాలూ పడటంతో ఆ హీరోమీద వెర్రిమమకారం పుట్టుకొచ్చేది తారకి. అలాగని సినిమాలు చూసి ఆనందానుభూతిని పొందగలిగే సీన్సు తన జీవితంలోనికి వస్తాయని ఆమె వూహించలేదు. ఆమెకి ఆ యింటిలో ప్రతీదీ వింతగా వుంది. ప్రతీసంఘటననీ తన పూర్వజీవితంతో పోల్చి చూసుకొంటూంది. ఒకొక్కప్పుడు ఈ ఐశ్వర్యం అనుభవించటానికి తనజీవితం చాల దేమో అన్న లోభత్వంకూడా కలుగుతున్నది. ఆమె చిన్న జీవన యానంలో ఇంత తీరిక నెన్నడూ అనుభవించలేదు. లేచింది మొదలు ఆదరబాదరాగా స్నానంచేయటం జుట్టు దువ్వుకొని జడ అల్లుకోవటం ముఖాన్న ఇంతకుంకుమపెట్టుకోవటం, దారిలో కనపడ్డ ఏదోఒకహోటల్లో ఇంత కాఫీత్రాగి ఆఫీసుకి జేరుకోవటం దినసరిపనులుగా వుండేవితప్ప ఇతర విశ్రాంతి పూర్వకమైన ఆనందపు పనులు ఆమెకి వుండేవి కావు. సాయంకాలం ప్రతీరోజూ, ఆమె జీవితానికొక సంక్రాంతిలావుండేది. రాజుతో పిచ్చిపిచ్చి ఖబుర్లు చెప్పుకుంటూ ఇసకలో ఇష్టంవొచ్చినంతసేపు దొర్లిపోయేది! ఇక్కడ ఆమె సౌఖ్యానికీ, విశ్రాంతికీ అంతే వుండటంలేదు. తలస్నానంచేసి వచ్చేసరికి పనిమనిషి తల టర్కిష్‌తువ్వాలుతో తుడిచి, సాంబ్రాణిపొగవేసి జుత్తంతా ఆరవేసి చిక్కు-

తీస్తుంది తనంతపొడుగునా వున్న నిలువుటద్దంముందు నించునేసరికి తనశరీర నిర్మాణంలోవున్న వొయ్యారం ఆమెనే ముగ్ధపరిచింది. వొత్తుగా నల్లగా కెరటాలల్లే ఆమె పిరుదులని దాటి జారిపోతున్న జుత్తుని చూసి ఆమె విస్తుపోయింది. ఆమెకి అంతపొడుగాటి జుత్తువుందని ఆమె గ్రహించలేదు. స్నానం చేస్తే చిక్కు తీసుకుందుకు ఆలస్యం అయిపోతుందని పాపిటమటుకు దిద్దుకుని అల్లానే జడవేసేసుకునేది. ఎల్లాగో కళ్ళల్లోకి ఎగరకుండా వేసుకునేది జడ! ఇక్కడ పనిమనిషి చక్కగా దువ్వి జారుగా బారెడు జడవేసి తలలో గుప్పెడు స్వర్ణ సంపెంగలో, శ్వేతగులాబులో తురిమేది! ఆ చీరలు! ఆమెకి అన్నేసి వందల రూపాయల విలువగల జరీ చీరలు వుంటాయని తెలీదు! తెల్లని చిన్న జార్జెటు చీర ధరించిన ఆమె శరీరం మంచుబిందువులతో తడిసిన మల్లెపూవులా జలదరించింది!

ఆమె అల్లానే బాల్కనీలో పిట్టగోడ కానుకుని నించుని తోటలోకి చూసింది. దూరంగా సత్యన్నారాయణ స్వామి కోవెలగోపురం వెన్నెలలో వెండిలా మెరుస్తున్నది. ఆ గోపురం వెండినీడలు సరస్సులోని తామరాకులమీది నీటి బిందువులతో చెలిమి చేస్తున్నాయి. కొబ్బరిచెట్ల ఆకుల మీదకు వచ్చి కూర్చున్న తెల్లనికొంగలు తారనిచూసి సిగ్గుపడి ముక్కులని పొట్టలోకి పెట్టుకున్నాయి. సర్వప్రకృతి ఒక మనోహర రామణీయకతతో పులకించిపోతున్నది. క్రింద హాలులో ఏదో వ్రాసుకుంటున్న గోపాలరాంకి హఠాత్తుగా

తార గుర్తుకి వచ్చింది. ఆమె ఏమి చేస్తోందోనని పైకి వొచ్చాడు. బాల్కనీలో వెన్నెలవర్షంలో వెన్నముద్దలా నిలబడిపోయివున్న తారనిచూసాడు. భర్త అడుగులచప్పుడుకి వెనుతిరిగి చూసింది. ఆమె మెత్తనిజుత్తు నెమ్మది నెమ్మదిగా కదిలి చెంపలకి హత్తుకుంటూంది. చంపల్లో ఒక లాలిత్యమైన మెరుపు ప్రతిఫలిస్తోంది. ఆమె కాటుక రేకల్లో కల కల లాడుతూన్న కన్నులు అతనివెంపు ప్రేమగా చూస్తున్నాయ్ !

"తారా! బయట చలిగా లేదూ! ఇంకా నిద్ర పోయావేమో అనుకున్నాను! లోపలికివెళ్ళి నిద్రపో! మంచుకి వళ్లు నెప్పులు పుడుతుంది" అన్నాడు.

"వూఁ" అంది తార. అతను ఆమెలోని మత్తుని చూడలేదు.

"మంచు బాగా కురుస్తున్నది ఇంక ఇక్కడ నిలబడకు! జలుబు తప్పకుండగా చేస్తుంది! నామాట విను! అన్నట్లు తెల్లవారుఝామున నేను బొంబాయివెళుతున్నాను. నీకు డబ్బు కావలసివస్తే నటేశాన్ని అడిగితీసుకో! అందాకా రెండువేలకి చెక్కు నీపేర వ్రాసాను. రేపు వెళ్లి చెక్కుని కాష్‌గా చేసుకో!" అన్నాడు. ఆమె మౌనంగా నిలబడింది.

"పద! తారా! లోపలికి పద!" అని మేడమెట్ల వెంపు నడిచాడు. తారని, ఏదో వ్యక్తం చేయలేని నిస్సహాయత ఆవరించింది. గబగబా బెడ్ రూములోనికి వెళ్ళి

మంచంమీద బోర్లగిలాపడి వెక్కి వెక్కి ఏడ్చింది ఆమె వేదనేమిటో ఆమెకే తెలియటంలేదు. ఆ మృదుశయ్య ఆమెకేమాత్రం ఓదార్పు నీయటంలేదు. ఆమెని ఓదార్చ గల శక్తి ఒక్క గోపాలరాం చేతులకే వుంది! కాని ఆ చేతులు వాణిజ్యపు లావాదేవీలు వ్రాయటంలో మునిగి పోయి కోమలమైన భుజాలని తనవెంపు త్రిప్పుకోగల సామ ర్ధ్యాన్ని కోల్పోయాయ్! ఆమె భుజాలు కుదుపుకుంటూ అల్లానే వెక్కి వెక్కి ఏడుస్తోంది. మళ్ళీ గోపాలరాం అటు వెంపు వచ్చాడు.

"దీపం కాగడాలా వెలుగుతూంటే నిద్ర పట్టుందా తారా?" అంటూ డిమ్‌గా వెలిగే జీరోవాల్టు నీలిబల్బు అక్కడపెట్టి మిగిలినలైట్లు ఆర్పేసి క్రిందకు వెళ్ళిపోయాడు. దగ్గ రగా వచ్చి తన రెండుభుజాలూ పుచ్చుకుని "ఏడుపెందుకు తారా!" అని అనునయిస్తాడని ఎదురుచూసిన తారకి తీరని వజ్రాఘాతమైంది అతని ప్రవర్తన. ఇంకా బాగా ఏడిచి ఏడిచి అర్ధరాత్రి ఏ వంటిగంటకో నిద్రపోయింది తార

## 9

"అసలు నువ్వెప్పుడూ బద్ధకస్తుడివే! తారుంటే నీ వంతుపనికూడా ఆమెచేత చేయించేవాడివి! నీకు బొత్తిగా పనిమీద ధ్యాసవుండదు. అందులో తార పెళ్ళిచేసుకున్నదని

విన్నాక, మజ్నువే అయిపోయావ్ ! ఇంకా ఇలా బేఖాత రీగా ఆఫీసులో పనిచేయలేకపోవటంకంటే చొక్కా చింపు కుని, రోడ్లమీద పాటలు పాడుతూ తిరగలేకపోయావా ?" అన్నాడు గణేష్. రాజుకి గణేష్ చిరాకు, కోపం చూస్తే నవ్వు వచ్చింది.

"తార మానేస్తే నేనేం చేసేది సార్? ఈసారి ఒక ఆంగ్లో ఇండియన్‌ని వేసుకోండి. టైపు చేయనా అడ్వర్ టైజ్‌మెంట్ ? వాంటెడ్ ఎ స్మార్ట్ లేడీస్టెనో, అన్‌మారీడ్ ఫర్ ఎ వెల్ ఎస్టాబ్లిష్‌డ్ టైప్ ఇన్‌స్టిట్యూట్. మినిమమ్ క్వాలిఫికేషన్స్, ఎ మ్యూజిక్ డిప్లొమా అండ్ మస్ట్ బి ప్రొఫిషెంట్ ఇన్ బాల్‌రూం, డాన్సింగ్, రాక్ అండ్ రోల్ ఎక్స్‌ట్రా" అన్నాడు. గణేషయ్యరుకి రాజు జోకుకి నవ్వు రాలేదు. పైగా మరికాస్త కోపం తెచ్చుకున్నాడు. అసలు ఆ ఆఫీసులో రాజంటే ఎవ్వరికీ ప్రత్యేకమైన అభి మానమంటూ ఏమీ లేదు దానికి కారణం తారకి అందరి మీదకన్న రాజుమీద ఎక్కువ ఆత్మీయత ఉండటంకూడా ఒకటి కావచ్చు ! కాని రాజు ఆ కంపెనీలో పనిచేసే అందరి కన్నా చాలా చిన్నవాడు ! బట్టతలాయన పేరు వెంక టప్పయ్య ! గణేష్ నాన్నగారి కాలంనుంచీ ఈ ఇన్‌స్టి ట్యూట్‌లో పనిచేస్తున్నాడు. "కాస్త ఎక్కువగా పనిచేయటం నుంచి బట్టతలయిందికాని, ముఖవర్చస్సు నెహ్రూగారి వంశీ కుల్లా వుంటుంది !" అని ఆయన అభిప్రాయం. వెంక టప్పయ్యకి మొదటిభార్యపోయి పదిహేనేళ్ళయింది. జాగ్ర

త్తగా నాలుగుడబ్బులు వెనకేసుకుని, ఆపయిన శుభ్రమయిన చదువుకొన్న అమ్మాయిని ద్వితీయం చేసుకోవాలని ఆయన అభిప్రాయం ! తార ఆ ఇన్‌స్టిట్యూట్‌లో జేరినప్పట్నుంచీ, ఆయన పొందూరు ఖాదీ జరీపంచెలూ, వెస్టుకోటు ధరించటం మొదలుపెట్టారు. శుభ్రమయిన చిన్న బంగాళా పెంకుటిల్లు కొనుక్కున్నాడు! తారతో ఎప్పుడూ మురిసి పోతూ మాట్లాడేవాడు. గణేశయ్యర్‌కికూడా తారంటే తెలీని మమకారం కలిగేది. కాని అది గుప్తధనంలా ఆయన మనస్సులోనే నిక్షిప్తమయ్యేది. తారకూడా చంటిపిల్లవాడి చేతిలోని రబ్బరు బొమ్మలా గణేశయ్యర్ ఏదిచెప్పినా బుద్ధిగావిని నడుచుకునేది. తార బుద్ధిమంతతనం, అమాయకత గణేశయ్యర్‌ని లొంగదీసుకుంది. తార నిష్క్రమణతో ఆఫీసులోని చైతన్య స్రవంతికి ఆనకట్ట కట్టినట్లు నిర్జీవంగా తయారైంది. అంచేత గణేశయ్యర్ ఎప్పుడూ ఏమి జరిగినా కలవరపడని గణేశయ్యర్ తారలేని లోటుని ఆఫీసులో తేలిగ్గా తీసుకోలేక పోయినాడు. అంచేతే రాజు ఎప్పటిలా ఫ్రీగా మాట్లాడితే సహించలేకపోయేడు.

"వెధవజోక్స్ మానెయ్యి రాజూ ! జాగ్రత్తగా పని చేయగలిగితే చేయి ! లేకపోతే రాజీనామా ఇచ్చేసి తారకి పి. ఎ. గా ఫో !" విసుగ్గా అన్నాడు గణేశయ్యరు. రాజు ప్రతి మాటా ఎవరేమన్నా సిల్లీగా తీసుకునేవాడు. అతనికి ఈసారి కోపం వచ్చింది. నిజానికి తారలేకపోతే ఏదో వెల్తి అని పించకపోలేదు.

"నాకూ అలానే తోస్తూంది సార్! లేకపోతే సగం జీతం పుచ్చుకుని, నిండుజీతం పుచ్చుకునేట్లు సంతకం పెట్టించుకునే సంస్థల్లో పనిచేయవలసిరావటం మా తెలివితక్కువ కాదూ! కానీయండి! మాటికీ పదేపదేగా తారతో నన్ను కలిపి అవమానకరంగా మాట్లాడటం మీలాంటి పెద్ద మనుష్యులకి యుక్తంకాదు అని మనవి చేసుకుంటున్నాను" అన్నాడు వెటకారంగా.

"ఛుఛు! తారా రాజుగారూ! తారతో మిమ్మల్ని కలపటం అంత అవమానకరం అయిందా? నిన్నటిదాకా ఆమెతో చేయికలిపి మమ్మల్ని తెగ వేధించేవారు కదా! ఇప్పుడు ఆ అమ్మాయిపేరే చేదునిజం అయిపోయిందా?" వెక్కిరింపుగా అంది రమ.

"చేదుకాదా! హంతకి! ఎంతపని చేసింది? నవ్వించి, కవ్వించి ఆశలు రేకెత్తించి, తోటి సోదరుణ్ని మోసపుచ్చినందుకు ఆమెను ఏమయినా అనవచ్చును!" గుండూరావు వన్ అన్నాడు. అతనూ తన శక్త్యానుసారం తారను ఆరాధించదలచినవాడే! రాజులో తనకన్నా ఎక్కువ సుగుణాలు లేకున్నా 'కురవెధవ' అనే మెరిట్ ఒకటి ఏడిచిందని తనలో తనే రాజంటే కుళ్ళుకునేవాడు.

"నేను అప్పుడే కనిపెట్టాను లేండిరా! మీరంతా వొఠ్ఠి వాజమ్మలు కానీ! ఆ జి.జి. రాం ఆఫీసులోనికి రాగానే వెనకాల తోకల్లే మానేజరు దగ్గరికి పరిగెత్తేది! వాళ్ళిద్దరి

మధ్యా ఏదో లిటిగేషన్ జరగవచ్చునని నా కప్పుడే అనుమానం తట్టింది ! చెప్పద్దూ మనలోమాట ! అంత గొప్పవాడితో కులకాలన్న దానికి మనము కనిపిస్తామా? పాపం కుర్రవాడు కనుక రాజు ఆశపడ్డాడు కానీ" అని దీర్ఘం తీసాడు గుండూరావు నెంబరు టూ.

"అసలుకి అది ముందునుంచీ రాజగోపాలం కోసరం వలపన్నుక కూర్చుందట్రా ! ఆయన దీన్ని ఏమి చేస్తాడో కాని, సింహాన్ని వేటాడతల్చిన వాళ్ళకి కుందేళ్ళ గెంతులు కన్పిస్తాయా ! ఏమిచేస్తాం రాజూ ! కాలంవల్ల తగిలిన గాయము కాలమే మాన్పుతుంది! ఇంతకీ ఆయన ఇది లాంగదని పెళ్ళి చేసుకున్నాం అనే పేరు చెప్పాడుకానీ నాలుగు రోజుల్లో వదిలించేసుకోడూ ! అంత జమీా ఈ దిక్కూమొక్కూలేని దానికి పట్టంకడతాడా ! మహాపీనాసివాడు అసలే !" అన్నాడు వెంకటప్పయ్య ! వగచినట్లూ, వాతలు పెట్టినట్లూ పెదవి విరుస్తూ అన్నాడు.

"ఈ కుర్రకారువాళ్ళకి అసలు ప్రేమంటే ఏమి తెలుసు ? అమ్మాయిలకి టెరిలిన్ బుష్‌షర్టూ, అబ్బాయిలకి నైలాన్ చీరలూ కనపడగానే ప్రేమ ప్రేమ అంటూ వెంటాడుకోవటం, ఎవళ్ళ పెద్దవాళ్ళు వాళ్ళవాళ్ళను కాసుకుని పెళ్ళిళ్ళు చేసేసి విడదీస్తే, చొక్కాగుండీలు విప్పుకొని, క్రాఫింగ్ చెరిపేసుకొని తిరిగే అబ్బాయిలూ, నల్లచీరా, జాకెట్టూ ధరించి జుట్టు విరబోసుకునే బాలామణులూ మన్ని అవస్థలు పడతారు చూడమని ! సంసారం స్థిరపర్చుకోవా

లనే ఒక నిశ్చితాభిప్రాయానికివచ్చి, పరస్పర ప్రేమాభిమానాలు పెంపొందే దృఢమనస్తత్వము కలిగేదాకా, ఓపిక పట్టి అప్పుడు పెళ్ళిళ్లు చేసుకుంటే ఆ దాంపత్యం స్వర్గతుల్యంగా వుండదూ! ఈ కుర్రవాళ్ళ విరహావేదన్లు వినలేక కనలేక మనం ఛస్తున్నాం!" అన్నాడు సగంనెరసిన క్రాఫింగ్. ఆయనకి ఆరుగురు అమ్మాయిలూ, ముగ్గురు కొడుకులూ వున్నారు. బహు కుటుంబీకుడు! ఇక్కడ పని చేస్తూ, మార్వాడీలకి పద్దులు వ్రాసి పదీ పరకా ఏరుకుంటాడు. ఇంటిదగ్గర పనిచేస్తానని, ఆఫీసు టైపుమిషను పట్టుకవెళ్ళి ఇరుగూ పొరుగూ పిల్లలకి హయ్యర్ లోయర్ గ్రేడు పరీక్షలకి ట్రైనింగు ఇస్తాడు. మొత్తానికి బ్రతకనేర్చిన వాడు! రాజుకి వీళ్ళమాటలు వింటూంటే ఒళ్ళుమండింది. కాని ఏమీ అనకుండగా తన సీటులోకివెళ్లి కూర్చుని పని చేసుకో సాగాడు.

## 10

రమకి, నాలుగురోజులుగా జ్వరం వచ్చింది. ఇంట్లో తినటానికేం లేదు జోగప్ప బాగా, తిట్టి కొట్టి ఇల్లువదలి వెళ్లి వారంరోజులయ్యింది. ఆ రోజున రమ జీతం అంతా పట్టుకుని వెళ్లాడు. మళ్ళీ ఇంకా తిరిగిరాలేదు. చంటిపాపకి

పాలు తక్కువై గంజి పట్టటంవల్ల పొట్టపెరిగి గట్టిగా తయారవుతోంది. ఎప్పుడూ నవ్వుతూ తృళ్ళుతూవుండే పాప, చీదరగా ఏడుస్తూ నీరసంగా డేకుకుంటూంది. సుందరి పొరుగింటికెళ్లి వృత్త చేతుల్తో తిరిగివచ్చింది.

"మునుపే మూడు శేర్లు బియ్యం ఇవ్వాలి! ఇంక అప్పు ఇయ్యం! అని ఖచ్చితంగా అన్నారు అక్కా!" అంది దీనంగా.

"అయితే ఒక పనిచేయి సుందీ! పల్లిపేటవెంపు వెళ్లి ఒకశేరు నూకలు కొనుక్కొనిరా! జావకాచుకుందాం!" అంది రమ

"మరి డబ్బులో"

చెంగునున్న అర్ధరూపాయికాసు, సుందరిచేతుల్లో పడేసింది రమ. మిగిలిన రెండుపావలాకాసులూ మళ్ళీ చెంగున కట్టుకుంది జోగప్ప వచ్చాడు. వస్తూనే "వంటయిందే?" అన్నాడు. బనీను విప్పి వంకెకు తగిలిస్తూ జోగప్పని చూస్తూనే రమ హృదయం కలుక్కుమంది ఎంతయినా ప్రేమించి పెళ్లిచేసుకున్న భర్త! అతను అసమర్థుడవటం తన ఖర్మకాక మరేమిటి? రమ ఫోర్తుఫారం చదువుతూండగా రమ తల్లితండ్రులు రమకి పెళ్లిచేసారు విరిసే విరియని పూవులాటి రమ యవ్వనాన్ని కలుషితం చేస్తూనే ఆ పెళ్లికొడుకు యాక్సిడెంటులో చనిపోయాడు! అత్తవారు రమని మనసారా దీవించి పుట్టింటికి తోలేసారు! పెళ్ళయిన చిహ్నంగా రమకి మిగిలినది కడుపులో కరాలుమని మెలి

తిరిగే ఆరునెల్ల జీవి! సుందరిపుట్టగానే రమ స్కూల్లోజేరి, స్కూలుఫయినల్ అయిం దనిపించింది. ఆసరికి రమ తల్లి తండ్రులు రమనీ, చిన్నపాపనీ కాలంవేసే పాశాలకు నిస్సం కోచంగా వదలి కన్ను మూసారు! చేతుల్లో ఏడాదిపాప! స్కూలుఫయినల్ సర్టిఫికెటుతప్ప మరో ఆధారం లేని ఒంటరియవ్వనిగా రమ నిలబడిపోయింది! అనుభవం అసం తృప్తంగా మిగిలిపోయిన అనూభూతులు! వెన్నెముక లేనిస్త్రీ లకి యవ్వనం లేనిపోని విపత్తులని కొని తెస్తుంది! ఆ శరీరపు ఉన్మాదపు పొంగుల్లో విచక్షణా జ్ఞానం పోయి శూన్య దృకృ థంతో మొండితనం ఆవరిస్తుంది. చివరికి వారికి మిగిలేది అంతులేని ఆవేదన! భావం శూన్యమయితే కాని పరి తప్తలు కాలేరు! పరితప్త అయిన స్త్రీ నిండు మనసుతో ఏకత్వం పొందగలదు!

జోగప్ప ఆర్ముగం డ్రమెటిక్ ఎసోసియేషన్‌లో తబలిస్టుగా వుండేవాడు. ఆర్ముగం కేవలం నాటకాలే వేయించకుండా, నృత్యనాటికలనికూడా ప్రదర్శింప చేసే వాడు! అతనిచేతుల్లో ఎప్పుడూ అయిదారుగురు అమ్మా యిలు వుండేవారు! రమని దీనస్థితిలో చూసిన జోగప్ప, రమని మంచిచేసుకుని ఆర్ముగం కంపెనీలో జేర్పిద్దామను కున్నాడు! ఈ లోగా రమకి వుద్యోగం దొరకటంతో అది కుదరలేదు జోగప్ప చూపించే ఆపేక్షని నమ్మిన రమ సుందరి తన చెల్లెలని చెప్పి జోగప్పని పెళ్ళిచేసుకుంది. పెళ్లిచేసుకున్న మొదటి సంవత్సరం బాగా అన్యోన్యతగా

వుండేవారు. రానూరానూ జోగప్పకి సప్తవ్యసనాలూ అల వాటు అయ్యాయ్! అయినా భర్త అనే ఒకచెట్టునీడన వున్న స్త్రీ అవటంచేత, రమ నీతివంతంగా కాలాన్ని నెట్టుక పోతోంది. ఆ రక్షకోసరమే ఇప్పుడు జోగప్ప కొట్టినా తిట్టినా రమ పడి వుంటోంది!

"చెల్లి వెళ్లింది! బియ్యం తేవటంకోసం! వచ్చాక వండుతాను!" అంది రమ.

"అల్లాగే కాస్సేపు ఆగుతానులే!" అన్నాడు. ఇవ్వాళ జోగప్ప మామూలుగానే ఉన్నాడు!

"ఆఫీసు కెళ్ళలేదేం రమా!" అన్నాడు.

"జర్వం నాల్గురోజుల్నించీనూ!" అంది రమ.

"అందుకే నీరసంగా కనపడుతున్నావు!" హఠాత్తుగా జోగప్పలో మానవత నిద్ర లేచింది. చప్పున రమ దగ్గరగా వచ్చి చేతుల్తో దగ్గరకు తీసుకున్నాడు.

"రమా! ఎందుకు పెళ్లిచేసుకున్నావ్ నన్ను? ఏం సుఖపడుతున్నావ్ నావల్ల! నీ జీతంరాంగానే దాచేసుకో రమా! నా కళ్ళబడనీయకు! నాకు డబ్బు కనపడితే వెర్రెత్తిపోతుంది! వ్యసనాలకి దాసుణ్ని అయిపోయాను. రమా! నేను వెధవని!" అన్నాడు. ఆ లాలనతో రమ శరీరం పరవశించిపోయింది. హిందూ స్త్రీల మనో దౌర్బల్యము ఆమెలో నిండా వుంది!

"అల్లా అనొద్దు మీరు! నేనేం కష్టపడుతున్నాను! ఏ స్త్రీ మైనా ఎవరికోసరం కష్టపడుతుంది? తనసుఖంకోసరం!

తన పిల్లల సుఖంకోసరం? స్త్రీకి ఈ సహనశక్తి ఈ స్వార్థ ప్రేమవల్లనే వచ్చింది. లోకంలోని మరేస్త్రీ సుఖముకన్నా, నా సుఖంు విలువలేనిదికాదు!" అంది రమ.

"నీ పిచ్చి భ్రమ పోదు రమా! నీ సౌందర్యోన్నతి ముందు తలవొంచాల్సిన వాడిని! కాలిగజ్జెల గలగలకి లక్షాధికార్లు నీ పాదాల మువ్వలుగుచ్చిన త్రాడుకి వ్రేలాడే వారు! కాని నా కోసం అంత సౌందర్యపూరితమయిన జీవితం వొదులుకున్నావ్! ఒక్కొక్కప్పుడు స్త్రీ కున్న నిర్మోహత్వం పురుషుడికుండదా అనిపిస్తుంది. ఎంత తృప్త జీవి స్త్రీ?"

జోగప్ప మాటలతో రమ గోదావరివరదల్లే పొంగి పోయింది. ఇంత సంతోషంలో వుండగానే చచ్చిపోయినా బాగుణ్ణు! అనుకుంది. జోగప్ప పాపని దగ్గరికి తీసుకున్నాడు. "పాప రోజు రోజుకీ చిక్కిపోతుందే! డాక్టరుకి చూపించ కూడదూ!" అన్నాడు.

రమ లేనివోపిక తెచ్చుకుని లేచి నిలబడింది. ఆ చిన్నగదిలో అటు దిటూ సర్దుతూ "అబ్బ ఎండెక్కిపోయింది! ఇంకా రాదేం సుంది?" అని సుందరిమీద విసుక్కుంది. జోగప్ప పాప ప్రక్కగా చోటుచేసుకుని పడుకున్నాడు. పాప అతని గుండెలమీద చేతుల్తో చరుస్తూ ఆడుకోసాగింది.

# 11

తార పూర్తిగా ధనిక వాతావరణంలో మునిగిపో యింది. ఆ గగనచుంబన లాలసత్వంలో తాను మామూలు స్త్రీ పొందగలిగే కనీస మాధుర్యతకి దూరమయిందన్న స్ఫురణ రావటంలేదు! నిత్యం ఎంతోమంది హితులూ, స్నేహి తులూ వస్తూ పోతూవుంటారు! వాళ్లందర్ని ఆహ్వానించి, విందులూ, వినోదాలూ, ఏర్పాట్లు చేయటంలో క్షణం తీరికుండటంలేదు. సాధారణంగా వారానికోసారో, రెండు సార్లో వాళ్ళకి ఏకాంతం దొరుకుతుంది. అప్పుడంతా తార తాను చేసిన ఖర్చుల వివరాలు చెప్తూతుంది. అవి అతను పుస్తకంలో వ్రాసుకోవటంలో మునిగిపోతాడు! గోపాలుకి తన భోగభాగ్యాలవల్ల 'తార'అమిత సౌఖ్యం పొందు తూన్నదని భావించాడు. తార దృష్టిలో గణేశయ్యర్ గోపాలరాం, ఒకే విధంగా కనపడేవారు గోపాలరాం తారకి 'బాస్'లా కన్పించేవారు తప్ప భర్తగా కన్పించే వాడు కాదు! స్త్రీగా ఆమెకి అతన్ని ఏవిధంగా అలంకరింప చేయాలో్న తెలిసేదికాదు. తనపట్ల గోపాలరాం కీ విముఖత ఎందుకో తెలిసేదికాదు. వాళ్ళిద్దరిమధ్యవున్న వయోభేదం, వాళ్ళని సామాన్య సంసారులుపొందే రసానుభూతినుంచి దూరంచేసింది. అనేక వెన్నెల రాత్రులు, తార అంతర్లీనంగా భాధపడింది. తన జీవితంలో ఏదోలోపం వుందని ఆమెకి

2853

అవ్యక్తంగా వేదన పట్టుకుంది. ఆ మూగవేదన మరచి పోయేందుకు లేనిపోని బాహ్యాడంబరాలను అలవర్చుకుంది. రోజు రోజుకీ వెర్రితలలువేసే నవనాగరిక విలాసినులతో కలిసిపోయేది. అందరూ తన అందాన్ని, శ్రీమతి హోదానీ పొగడుతూంటే తను మేఘాల్లోకి చొచ్చుకుని వెళ్ళిన నక్షత్రాలను ఒకటి ఒకటిగా త్రెంపి భూమిమీదకు విసరివేస్తున్నంత గర్వము కలిగేది! ఇది అంతా మిథ్యఅనీ తాను శాశ్వతమయిన చీకటి గుహల్లోకి చొచ్చుకుని వెళ్ళిపోయిందనీ తనకింక వెలుగుచూసే శక్తి అలభ్యమయినదనీ ఆమెకి తెలీదు. విపరీత ధనం కలిగించిన సౌఖ్యాల లహర్లలలో ఆమె వికసించిన కలువపూవులా వుంది. ఆమె వుదయమే లేచింది. స్నానం చేసింది. లేతనీలి టిష్యూ చీరలోంచి ఆమె పసిడివయ్యారం ఆమె దౌర్భాగ్యాన్ని చూసి చిన్నబోతోంది! ఇనప్పెట్టి తీసింది నీలాలు పొదిగిన జుంకీలు, నీలాలుపేర్చిన నెక్లెస్ ధరించింది పాలరాతి నునుపును సూచించే కంఠం చుట్టూ నీలాలు మెరుస్తున్నాయి. చేతికి నీలాల బ్రేస్‌లెట్ ఇంకా తయారుకాలేదు! చేతిమణికట్టుమీదికి వదులుగా జారిపోయే ముత్యాల బ్రేస్‌లెట్ వెలవెలబోతోంది. అది బాగులేదని ఆమె విసుక్కుంది. ఫోను గదిలోకివెళ్ళి నెంబరు డయిల్ చేస్తూ "చెల్లారాం"కి ఫోను చేసింది.

"హల్లో! తారా గోపాలా? నమస్తే మేమ్‌సాబ్!

ఊం అయిపోవచ్చింది! కొత్తరకం వజ్రాల నెక్లెస్ వచ్చింది! పారిస్ బ్యూటీ! వుంచమంటారా?" అన్నాడు చెల్లారాం.

"ఒకటి అట్టేపెట్టండి! బ్రేస్‌లెట్ ఇమ్మీడియట్‌గా పంపించండి! ఇవ్వాళ ఆ సెట్ ధరించాలనుకుంటున్నాను" అన్నది తార. ఈ లోపున ఫోను గణగణ మనేసింది.

"హల్లో ఎవరు?" అంది.

"సిటీడ్రెస్ మార్టు మానేజరు మూల్‌చంద్‌ని! కాశ్మీర్ సిల్కులో, జరీబార్డరున్నవున్న శారీస్ వచ్చాయి చూస్తారా?" అంది ఆ గొంతు.

"అల్లాగే! వేరే తీసివుంచండి! ఓ ఫైవ్ మినిట్స్‌లో అటువెంపు వస్తాను" అంది ఈ లోగా ఇంకో గొంతు.

"హల్లో తారా! గోపాల్! యడ్నా ఫెరర్ మెల్‌బోర్న్ వెళ్ళిపోతోంది. ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటు చేసాం! తప్పక మిస్ కాకుండా వుంటారుకదూ" అంది.

"అల్లానే" అని ఫోను పెట్టేయబోయింది తార. మళ్ళీ గణగణ.

"హల్లో గోపాల్! హాసమంజూష ఇవ్వాళ ఇంటర్‌నేషనల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ హాలులో ప్రదర్శన ఇస్తోంది. తప్పక అటెండ్ అవుతావుకాదూ! యూ. ఆర్. చీఫ్ గెస్ట్!" అంది ఇంకో గొంతు.

"వో. కే." అంది తార.

ఎన్ని ఎంగేజ్‌మెంట్లు? ఎంత ఎంటర్‌టయిన్‌మెంటుకి తను టైం వేస్టు చేస్తోన్నా కాలం దీర్ఘంగా నడుస్తోన్నట్లే

వుంది ఆమెకి. ఎందుచేతనని? పనిమనిషి గుమ్మందగ్గర సందేహిస్తూ నిలబడింది.

"ఏమిటా నించున్నావ్!" అంది తార. అమ్మగారి అనాఘ్రాత సౌందర్యాన్ని కళ్ళు విప్పుకుని చూస్తోన్న పనిమనిషి-

"బయట ఎవరో కాచుకోనున్నారమ్మా!" అంది. డ్రాయింగ్ రూంలోనికి వచ్చింది. కాషాయిరంగు పొడుగుపాటి అంగరఖా ధరించిన ఒక వ్యక్తి లేచి నిలబడి రెండుచేతులూ జోడించాడు. తార తనూ నమస్కరిస్తూ-

"కూర్చోండి" నమ్రతగా అంది. తార కూర్చోగానే ఆయన కూడా ఎదురుగావున్న సోఫాలో కూర్చున్నాడు.

"ఏమిటి చెప్పండి!" అంది తార.

"నన్ను 'జీవానంద' అంటారు. మా ఆర్ఫనేజ్ పిల్లల ప్లేగ్రౌండ్ బాగుచేయటానికి తగినన్ని ఆటసామాన్లు కొనటానికి అయిదువేలు అవుతుందని చెప్పారు శ్రెకటరీ! అందులో మూడువేలు మీకు "బెనిఫిట్ షో"లవల్ల వచ్చాయి! మిగిలిన రెండువేలూ చందాలుగా సేకరిద్దామని వచ్చాను" అన్నాడు జీవానంద.

"దానికేం? ఒక వెయ్యి నేను ఇస్తాను మిగిలిన దానికి చూసుకోండి! ప్రస్తుతం డబ్బులేదు. సాయంకాలం చెక్కు ఇస్తాను. మీరు క్యాష్ చేసుకుందుగాని!"

"ధన్యవాదాలు" జీవానంద లేచి వెళ్ళిపోయాడు. గోపాలరాం తార బిజీ ప్రోగ్రాంలుచూసి నవ్వుకుంటూవచ్చి కూర్చున్నాడు.

"ఏమండీ!" అంది తార.

"ఏమిటి?" అన్నాడు.

"యుద్నా ఫెరర్ వెళ్ళిపోతోందట! హోసమంజూష డాన్స ప్రోగ్రాం వుందిట!" అంది.

"హోసమంజూషా? ఎవరావిడ?" అన్నాడు గోపాలరాం. విచిత్రంగా చూసింది తార అతనివైపు. ఇన్ని రోజులుగా జమీందారులా పేరు ప్రఖ్యాతులుతో ఈ మహాపట్టణంలో జీవిస్తూకూడా ఎవర్నీ పరిచయం చేసుకోకుండా ఎల్లా వున్నారూ? ఎంత మూగజీవితం? అందుకనే తన సన్నిధిని కూడా......ఎల్లా అయినా అతనిలోని ఈ జడత్వం పోగొట్టాలి!

"ఫ్రెంచ్ డాన్సరండీ! ఈ దేశంవచ్చి, కూచిపూడి రీతులు నేర్చుకుంది!" అంది తార.

"నిన్ను ఇన్వైయిట్ చేసారుకాని నన్నుకాదుగా!" ఏదో విధంగా తప్పించుకోవాలని అన్నాడు గోపాల్ రాం.

"లేదు! ఎవరయినా రావచ్చును. మిసెస్ సహానీ చెప్పింది. టికెట్ ఎంతోలేదుకూడా నూటయాభయి రూపాయిలే!" అంటూనే వులిక్కిపడింది తార! ఒకరోజు వట్టి యాభయి రూపాయల్లో తను తిండీ తిప్పలూ గడుపుకొనేది పొందిగ్గా! ఈరోజు తను దానికి మూడురెట్లు వేస్ట్ మెంటర్ టయిన్ మెంటుకి ఖర్చుపెట్తోంది! దానివల్ల ఎవ్వరికి వచ్చే లబ్ధి కించిత్తూ లేదు! కేవలం టైమ్ కిల్లింగ్ కోసమే! అవును. తను ఏదోవిధంగా టైమ్ గడపటమే లక్ష్యంగా పెట్టుకుంది!

"నాకు ఆ డాన్సులు అంతగా నచ్చవు తారా! కావలిస్తే నువ్వెళ్ళు! నో అబ్జక్షన్!" అన్నాడు.

"మర్చిపోయాను చెల్లారాంకి పదిహేను వేలుఇయ్యాలి! మొన్న డైమండ్ నెక్లెస్ ఒకటి తీసుకున్నా!" అంది.

"ఏదీ నీ పుట్టిన రోజున తీసుకున్నావ్! అదేనా! ఆరోజే నటేశంచేత పంపించేసా! కావలిస్తే నా అకౌంట్ బుక్కు-చూడు!" అన్నాడు

"అబ్బే! అదికాదు! అది మంచి ముత్యాలది! మొన్న కొన్నది వజ్రాలది! ప్యూర్ డైమండ్స్!"

"సరేలే ఎంతన్నావ్! పదిహేను వేలా? నటేశంచేత పంపిస్తాలే!"

"అదకాదు! సిటీ డ్రగ్ మార్టువారికి నాలుగువందలు ఇయ్యాలి. మీరు డబ్బుయిస్తే ఆ దారినవెళ్ళి అందరికీ ఇచ్చేసివస్తాను" అంది. గోపాలుకి చిరాకు వేసింది

"మొత్తం ఎంతకావాలో్న చెప్పు! ఇక్కణ్నించీ నెలకింతకంటే దాటకూడదు నా ఎక్స్పెన్సెస్ అని నిశ్చయం చేసుకో!" అన్నాడు భర్తలా!

తారకి ఉడుకుమోత్తనం వచ్చింది. తను ఏ అండ చూసుకుని వున్నతంగా పరిభ్రమిస్తోందో, ఆ అండే తన్ని చిన్నచూపు చూడటం బాధ కలిగించింది. కళ్ళ నీళ్ళూరుతుంటే గోపాలు ఆమెకేసి చూసాడు

"అరరే! ఏమిటిది? ఈమాత్రం దానికేనా? భలే పిల్లవే! ఏమన్నాననీ" ఆశ్చర్యపోయి లేచివించుని దగ్గరకు

వచ్చి చేతుల్లోకి తీసుకున్నాడు! ఆ లాలన అంతవరకే! ఆ పిల్లది పసిపిల్ల కాదూ బొత్తుగా!

# 12

"రండి, అమ్మగారూ, రండి!" చెల్లారాం సంభ్రమంగా తారని ఆహ్వానిస్తూ కుర్చీ చూపించాడు. సేల్సుమెన్ ఆరెంజ్ గ్లాసు తెచ్చిఇచ్చాడు. తార 'స్ట్రా'తో సుతారంగా రెండుగుక్కలుపీల్చి, గ్లాసు టేబిల్ మీదుంచింది: 'బాగ్' తీసి వందరూపాయిలనోట్లు కట్ట చెల్లారాంకిచ్చి "లెఖ్ఖ పెట్టుకోండి!" అన్నది.

"అయ్యో మాంజీ, ఎంతన్నమాట? అన్నట్లు అరే గిరిధర్! మొన్న మెరుగుపెట్టిన బ్రేస్ లెట్ ఇటు తే! చూసారా? ఇది మీరు ఖరీదుచేసిన నెక్లెసు జతది! అప్పటి కిది ఇంకా తయారు కాలేదు. మీరు ఎలాగూ రావాల్సి వుంది కదా అని దీన్ని మీ కోసరం వుంచాను!" మిలమిల మెరిసిపోతున్న 'బ్రేస్ లెట్'ని చూపించాడు. తార కళ్ళు చెదిరాయి. అబ్బ! ఎంత బాగున్నది! భర్త ఏమంటాడో! ఎన్నని అడగటం! కొనకుండా ఎలా వుండటం? ధనంకలిగి వుంటే మటుకు, ఇల్లాంటి అద్భుతమయిన నగలు కొనకపోతే అల్లాంటి డబ్బుకి సార్థకత ఏముంది?

"ఎంత ?" ఆ బ్రేస్‌లెట్‌ని విలాసంగా వేలుకివేసి త్రిప్పుతూ అడిగింది.

"అయిదువేలే! మీ కొక్కవల్సుంటుందని నాకు తెలుసును. మాకు ఈ నమూనా గురించి మూడు ఆర్డర్సు వచ్చాయి! ఒకటి గాయత్రీదేవిగారు మహారాణీ రాజస్థాన్. వేరొకటి నేపాలురాణిగార్కి ఇచ్చాం! దీని జతది అమెరికాలోవున్న మన హై కమిషనర్ మిసెస్ అడిగారు! కాని ముందు మీరు చూస్తే కావాలంటారుకదా అని వుంచేసాం. వారికికూడా తయారీలో వుంది! మీరు కావాల్నంటే తీసుక వెళ్ళండి. డబ్బుకేమి మీ దగ్గర్నుంటే ఇనప్పెట్టెలో వున్నట్టే వుంటుంది" అన్నాడు చెల్లారాం. తనకోసరం చేయించాం అన్నప్పుడు వద్దనడం బాగుంటుందా? అంతంత వున్నత వంశీకుల స్థాయిలో తన్నికూడా నిలువబెట్టిన 'చెల్లారాం' మాటలని తీసేస్తే, అతని దృష్టిలో తన 'స్టేటస్' విలువ జారిపోదూ! ఆయనకి ఎలాగోఅలా నచ్చచెప్పుకోవచ్చును! పదిహేనువేలూ చెల్లారాంకి చెల్లుబెట్టి బ్రేస్‌లెట్ తీసుకుని బయటకి వచ్చి పేవ్మెంటుమీద నించుంది. నటేశం తార బయటికి రావటం గమనించలేదు. దారమ్మటపోయే అయ్యాంగార్ల పిల్లలని చూస్తూ గుటకలు మింగుతూ సిగరెట్ పీలుస్తున్నాడు. తనప్రక్కనించి గబగబా నడుచుకుపోతున్న స్త్రీని చూసి ఉలిక్కి పడింది తార! ఆసిగ! ఆ పాప! అవును రమే! సందేహమెందుకు? పిలాస్తే తీరిపోతుంది. ఆ సందేహమేదో—

"హల్లో! రమా! రమాదేవిగారూ?" తార బిగ్గరగా పిలిచింది. రమ వెనక్కి తిరిగిచూసింది.ఎవరా సౌందర్య పూరితమైన భాగ్యదేవత? ఆమె కితనితో ఏం పనీ? ఆలోచిస్తూ నుంచుండిపోయింది రమ. తార రెండంగల్లో రమ దగ్గరికి వచ్చింది స్నేహపూరిత కంఠంతో.

"రమా? గుర్తుపట్టలేనూ! మీరు! అంతగా మారిపోయేనా! నేనూ తారని!" అని మృదువుగా నవ్వింది. రమకి ఒక్కసారి శ్రావణలక్ష్మికథ జ్ఞాపకానికొచ్చింది. కళ్ళు పెద్దవి చేసుకుని విభ్రమంగా చూసింది రమ తార వెంపు. తార కిలకిల నవ్వింది

"యింకా అవమానమేనా రమా! నేను తారని. మీతోబాటు స్టెనోగా పనిచేసిన తారనే!" అంది. రమలో ఒక్కసారి, అవ్యక్తంగా ఒకవిధమైన ఉద్విగ్నత ప్రబల సాగింది! తారే అయితే తన్ని ఎందుకు పలకరించినట్లు? తన ఐశ్వర్యం ప్రదర్శించటానికా? రమకు ఆమె అనుభవిస్తున్న దారిద్ర్య బాధలవల్లధనికులంటే ఒకవిధమైన ఏహ్యభావం కలిగింది! వాళ్ళంతా దుర్మార్గులనీ, దురాశాపరులనీ, అసహ్యించుకునేది! అసలే తారంటే ఆమె కెప్పుడూ సదభిప్రాయంలేదు. రాజుతో చనువుగా తిరుగుతూనే గోపాలరావుని లోంగదీసి, యిప్పుడు తగుదనమ్మా అని శ్రీమతి ముసుగులో ఉత్తమ ఇల్లాలుగా సంఘంలో ఉన్నత కుటుంబీకుల్లో కలిసిపోయిందని రమకి తారంటే అసహనం కలిగింది.

ఏదోవిధంగా తార మనస్సుని గాయపరిస్తే కాని రమలో రాజు కుంటూన్న అసూయాగ్ని చల్లారదు!

"తారా! మీరా! గుర్తుపట్టలేకపోయాను. పాపం అన్నట్లు మీ రాజుని ఉద్యోగంలోంచి బర్తరఫ్ చేసారునిన్న" అంది రమ ఆమె ముఖం తప్తకాంచనంలా మెరవసాగింది.

"అల్లాగా! అయితే మరేం చేస్తున్నాడు?" అంది తార జిజ్ఞాసగా.

"అసలు రాజునే కాదులే! మా అందరి వుద్యోగాలూ ఊస్టింగ్ అయిపోయాయి. 'రోజీ' అని ఒక ఆంగ్లో ఇండియన్ వొచ్చింది. మీరు వెళ్ళిపోయింతర్వాత ఆమెని పెళ్ళిచేసుకున్నారు బాస్. ఆమె బెంగుళూరులో ఏదో వుద్యోగం దొరికితే వెళ్ళిపోతానందట! అందుకని ఈయన వున్నదంతా అమ్మేసుకున్నారు. వెంకటప్పయ్య కొనుక్కున్నాడు. మిగిలిన మిషన్లు ముగ్గురూ కొంచెం కొంచెం కొనుక్కున్నారు. ఎవళ్ళదారివాళ్లు చూసుకున్నారు. ఇంక నేను మిగిలిపోయాను" అంది రమ.

"మరి మీరేం చేస్తున్నారు?" అంది తార.

"ప్రస్తుతం బడిపంతులమ్మని కాని జీతం ఎక్కువే వస్తోంది అన్ట్రయిన్డ్ అయినా అరవయిరూపాయలూ ఇస్తున్నారు" అంది రమ.

"మరి రాజు?" తార పెదాలు అవ్యక్తంగా వణికాయ్!

"ఏమో మాకు కనపట్టంలేదు మీరు మానేసిన మర్నాడు గణేష్‌గారు ఆయనతో పోట్లాట వేసుకున్నారు." తృప్తిగా అంది రమ. తార హృదయంలోని నిశ్చల మను తాగ్ని రాజుకుంది.

"మీరు ఎక్కడకు వెళ్తున్నారు రమా! మీ పాప కదూ! అల్లా చిక్కిపోయిందే?" సంభాషణ మారుస్తూ అంది తార తమాయించుకుని.

"మా పాపే! లివర్ ముదిరిపోయిందన్నారు డాక్టర్లు. మందులు ఇస్తున్నారు. ఇప్పుడు హాస్పటల్‌నించి వొస్తు న్నాను" అంది రమ. తార పాపని చేతుల్లోనికి తీసుకుని చూసింది. అమెలోని నెరవేరని కోరిక లేవో పాపని స్పృశించ గానే పురి విప్పుకున్నయ్. తనకు కూడా పాపలు కలిగితే? అసలు కలుగుతారా? ఎల్లా? రమ పాప నల్లబడి సన్నగా వుంది. చేతులూ కాళ్లూ నిస్సత్తుగా పూచికపుల్లలల్లె వ్రేలాడు తున్నాయి! వెలిసిపోయిన జానెడు వాయిల్ జుబ్బా లోంచి పొట్ట గట్టిగా, ఎత్తుగా కన్పిస్తోంది. కళ్ళు పెద్దవిగా చక్రాల్లావున్నా పచ్చబడి తమ జీవకాంతిని కోల్పోతు న్నాయి!

"చాలా నీరసంగా వుంది రమా పాప! మంచి మందులిప్పించండి!" ఆరునెల్ల క్రితం ఆ పాప బొద్దుగా పచ్చగా, ముద్దులు మూటకట్తూ, చాపనిండా కేరింతలు కొడ్తూ, దొర్లింతలాడే పాప రూపం గుర్తుకువొచ్చి వేదనగా అంది తార. రమ పక పక నవ్వింది. తార నిర్ఘాంతపోయింది.

తను అన్నదానిలో నవ్వు వచ్చేసంగతేమిటుందో ఆమెకి అవగతం కాలేదు.

"చూడు తారా! నీకు ఇప్పటి మా జీవితం అర్థం కాదు. మందులు! మంచిమందులు ఎల్లావొస్తాయి! కన్సల్టింగ్ ఫీజు అయిదురూపాయలూ వుంటే మా వారు నిశ్చింతగా మూడు ముక్కలాటకి హాజరవుతారు! ఏదో ఉల్భాగా ఇస్తారుకదా అని ధర్మాసుపత్రికి వెళ్ళితే అక్కడ ధర్మము, జలదేవతకి అభయమిచ్చి పరమేశ్వరుని "పేనలి" కెక్కి కూర్చుంది. రంగు నీళ్ళు ఇస్తారు వాళ్ళు! వాటికి జబ్బులు తగ్గవు అక్కణ్ణ మంచిమందులు కావాల్నంటే, కాంపౌండరుకి నాలుగూ అయిదూ సమర్పించుకోవాలి! ఔటు పేషంటు అయితే ధర మరీ ఎక్కువచేస్తారు వాళ్ళు! మన ప్రయత్నలోపం లేదు. అని మనసుని సమాధానం చెప్పి జోకొట్టటం కోసరం ఈ మందులకని తిరుగుతున్నాను ఇదొక విధమైన ఎస్కేపిజం! కొన్ని కొన్ని అలవాట్లు మానుకుంటే జీవితరథం నిరామయంగా సాగుతుందని తెలుసుండీ కూడా అవ్యక్తంగా ఆ అలవాట్లకి లోబడి, కష్టాలని కొని తెచ్చుకుని చివరన, చేతులు కాలేక ఖర్మసిద్ధాంతం వల్లె వేసుకోవటం ఒక విధమైన నిర్లక్ష్యం కాదా?" రమ హృదయాగ్ని జ్వాలలు తార శరీరం అంతా అలుముకున్నాయి. రమ భర్తని ఎదిరించలేని అసహాయ అయ్యింది. ఒకవేళ ఎదిరించి విడిపోయినా, ఆమెకి ఇంతకన్నా సౌఖ్యవంతమైన జీవితం దొరుకుతుందని హామీ ఏమిటి? పెనంమీంచి అట్టు

మాడలేక పొయ్యిలోకి గెంతినట్లు వుంటుంది. ఈ స్త్రీలు చదువుకున్నా, మగాళ్లని వదలలేరు! ఒకళ్ళ వదలి ఆస్థానం లోకి ఇంకోరిని తీసుకున్నా స్త్రీ పరిస్థితి ఏమాత్రం మారదు! యుగయుగాలుగా పురుషుల్ని భ్రమింప చేస్తున్నా మనుకుని మురిసిపోతున్న స్త్రీలు తామే భ్రమించుతున్నామని తెలుసు కోలేకపోతున్నారు. సృష్టికారకమైన ఈ ఆకర్షణనించి స్త్రీ మేలుకోగానే ఆమెకి సర్వమూ-శూన్యమయిపోతుంది. ఆనందానికి అవధికట్టడుంది? సుఖానికి ఎల్లలేమిటి? ఇవన్నీ ఎవళ్ళ జ్ఞానపరిధిలో వాళ్ళు వూహించుకుంటున్న వూహాల డోలికలు! ఈ ఆశాహర్మ్యలని ఆత్మదృష్టులు గమనించ లేవు! ఏ అనుభూతి అయినా శరీరానికే! అయితే ఆ శరీ రమూ నిత్యముకాదు? నిత్యమైన ఆత్మకి అనుభూతి వుండదు! అనిత్యమైన శరీరానికి అనుభూతి వుంటుంది. అదీ అనిత్యా మైన అనుభూతి! ఆ అనిత్యానుభూతికోసరం అవ్యక్తంగా వ్యక్తులుపడే బాధలు, కోపాలు, తాపాలు, ప్రతీకారాలు, ఉపకారాలూ, అపకారాలే చరిత్రలూ, కథలూ, నవలలూ, అవుతున్నాయి. భక్తిమార్గం ఇంకా అవ్యక్తమైనదిగా వుంటుంది. మీరా ఆండాళ్ శ్రీహరికోసం అవ్యక్తమైన ఆవేదన చెందారు. ఆ శ్రీహరి ఎవరు? ఎల్లావుంటాడు? కళ్ళతో చూసారా? లేదే? సమకాలీనులు కూడా కాదు. అయినా వాళ్ళు ఆరాధించేరు! తులసీ పూజన్ హారీ మిలేతో మై పూజూం తులసి హార్! పధర్ పూజన్ హారీ మిలేతో మై పూజూం పహాడ్" అంటుంది మీరా. అది తన్మయా

వస్తే! తార కళ్ళు తడిఅయ్యాయ్. బాగ్ తీసింది డ్రస్ మార్ట్ వాళ్ళకియ్యాల్సిన డబ్బుంది. అది తీసి రమ చేతిలో పెట్టి ఆమె గుప్పిట మూసింది గట్టిగా. రమకు కళ్ళనీళ్ళ పర్యంత మయింది. ఆమె అభిమానపూరిత మనస్సు వజ్రసన్నిభ మయినా ఈ సంఘటనతో మంచులా కరిగిపోయింది. అభి మానమనేది మహా చెడ్డది. అది ఎంతటి ప్రియమైన వారి నైనా వేరు పరుస్తుంది. ధనానికి మానవులని వున్నతము గానూ, వున్మత్తముగానూ కూడా మార్చగలిగిన శక్తివుంది. వ్యక్తుల మానసిక సంస్కారమునుబట్టి ధనదేవత లాస్య భంగిమలు వుంటాయి తారని ఈ ఐశ్వర్యం ఎంతమా త్రమూ వివశని చేయలేదు. అందుచేతనే ఆమెలో వితరణ బుద్ధి రెక్కలు విప్పుకుని ఎగురుతుంది. అందులో ఆమెకి అంతర్గతంగా ఏది శాశ్వతం అనే వేదాంత ధోరణి కూడా ముదరసాగింది. రమకి బాధకలిగింది. ఇద్దరూ కలిసి పనిచేసే టప్పుడు ఒకరంటే ఒకరకి పిసరంతైనా అభిమానం వుండేది కాదు. ఇప్పుడు కూడా తార తన్ని తన ఐశ్వర్య ప్రదర్శన కోసరం పిలిచిందనే తాను అపోహపడింది.

"చెల్లీ నన్ను క్షమించు! నీగురించి నా అంచనా తారుమారయిపోయింది!" అంది రమ.

"చెల్లీ!" తార మనస్సు పరవశించిపోయింది. చటు క్కున రమ భుజాలు గట్టిగా పుచ్చుకుని సంతోషంతో కుదిపేసింది.

"చెల్లీ అన్నారు! అదే చాలు రమా! నా కెవరూ లేరనుకొనేదాన్ని! నాకు తోడు నీడగా మీరు దొరికారు. వెయ్యేళ్ళ జీవితంలో విలువైన క్షణం ఇది నాకు! నమ్మ రమా! మీరు నాకు అక్క! పాపకి మంచి మందులు ఇప్పించండి! డబ్బు అయిపోతే ,మా ఇంటికి రాండి! మీ చెల్లి దగ్గర ఏమీ మొహమాటం పడొద్దు! నా మీద వట్టే తప్పకరండి! వస్తారుకదూ!" అంది తార. రమ శరీరం వివశమైపోయింది. అవ్యక్తమైన అనుబంధం రూపు దిద్దుకుంటోంది. అనూహ్యంగా రమ పెదవులు తార చెంపల్ని గాఢంగా స్పృశించాయి. తార ఆనందంతో పరవశమైపోయింది. తృప్తిగా కళ్ళు మూసుకుని కారులో కూలబడింది. కారు ఇంటికి జేరేదాకా కళ్లు మూసుకునేవుంది.

## 13

పార్కు బెంచీమీద నిద్రాదేవి వడిలో రాజు అనిర్వచనీయ ఆనందానుభూతిని అనుభవిస్తున్నాడు! పదిన్నర అయ్యింది. అప్పటికే రేడియో ఆపేసారు! మబ్బుపట్టి సన్నటి జల్లు ప్రారంభమవటంతో జనం క్రమ క్రమంగా తగ్గిపోయారు వాచ్ మెన్, ఒక్కొక్క దిక్కు వెంపు గేట్లు మూసుకుని తాళం వేసుకుంటూ వచ్చాడు. ఫౌంటెన్ దగ్గరున్న బెంచీమీద గుర్రుపెట్టున్న రాజుని చూసాడు. అతని

దగ్గరికి వచ్చాడు. రాజు కుంభకర్ణావతారం చూసి విసుక్కు న్నాడు. అతనికి ఇల్లాంటి వాళ్ళు బాగా అలవాటే! ఇంట్లో దెబ్బలాడి చేతికిదొరికినవి అంకించుకొని పట్నాలమీద పడు తారు. జేబులు ఖాళీ అయ్యేదాకా జల్సాలు చేసేసి తర్వాత పార్కు బెంచీలు డన్‌లోపిల్లోలూ, కార్పొరేషన్ టాప్ నీళ్ళు ఓవల్టిన్నూగా గడుపుతారు. వాళ్ళ వాళ్లు వచ్చి వెతు క్కొని తీసుకపోయేదాకా వాళ్లూ ఆ మహారాజయోగం అనుభవిస్తోనే వుంటారు! అందుకనే ఆ వాచ్ మెన్, ప్రతీ రోజూ విధిగా దినపత్రికని చూస్తూవుంటాడు. రెండు మూడు సార్లు అల్లా ఇంట్లోంచి వెళ్ళిపోయివచ్చిన వారిని అతను పట్టించాడు కూడా? దానివలన తను కొందరివద్ద బహు మతులు కూడా పొందాడు కాని ఈ మధ్య అతను కొందరి వల్ల 'ధోకా' తిన్నాడు. ఒకతన్ని వారంరోజులుగా పార్కులో చూసాడు. ఏదో లాభకరమైన "పిట్టే"అనుకొని అతన్ని లాలించేవాడు అతను అనుకున్నట్లుగానే ఆ ఆసామీ ఫోటో వివరాలూ దినపత్రికలో ప్రచురించబడ్డాయి. ఆచూకీ తెలిపినవారికి 500 రూపాయిల బహుమానం అని ప్రకటించ బడినది. దానితో అతన్ని ఇంకా జాగ్రత్తగా ఆ మాటా ఈ మాటా అడుగుతో మంచిచేసుకుని అతని వూరికి తీసుక వెళ్ళి అతని తల్లి దండ్రులకి అప్పగించి బహుమానం అడి గేడు. అడగ్గానే వెంటపెట్టుకుని వెళ్ళిన అబ్బాయి తారా జువ్వల్లె లేచాడు.

"నువ్వు నన్ను పట్టుకరావటమేమిటోయ్ నీ బొంద!
ఆ అడ్వర్టయిజ్ మెంటు చూసి నేనే వొచ్చాను మావాళ్ళ
దగ్గరికి అనవసరంగా అయిదుపందలు వేస్తు చేస్తారని"
నువ్వేదో స్నేహితంగా వుంటూంటే వూరు చూట్టాని కొస్తు
న్నావనుకున్నాను. మా దగ్గర ప్రయిజ్ లాగటాని కను
కున్నానా! అలా తెలిస్తే అక్కడే చెప్పివుండేవాడిని అన్నాడు.
ఇతను చేసేదేమీలేక బ్రతిమాలి, బామాలి రైలుఖర్చులు
పుచ్చుకోగలిగి వచ్చాడు. తిరిగి అప్పట్నుంచీ ఈ బలా
మూర్ఖ నిచూస్తే అతనికి మంచికోపం వస్తోంటుంది.

"లేవవయ్యా యువరాజా ! మేలుకో. బయటకు
నువ్వుపోతేకాని తలుపువేసుకొని, నిద్రపోడానికుండదు" అని
రాజుని అటూ ఇటూ కుదిపాడు.

"వూఁహూ" రాజు బద్ధకంగా మూలిగాడు. నెమ్మదిగా
కళ్ళువిప్పి మత్తుగా చూసాడు.

"లేరా నా తండ్రీ! ఇలా ఎన్నాళ్ళు బబ్బుంటావు?"
అన్నాడు వాచ్ మేన్ వికటంగా.

"ఎవరు నువ్వు స్వామీ!" అన్నాడు రాజు మత్తు
గానే.

"మరే, పరమానందస్వామిని! ఏం బాబూ బాగా
వేసుకొచ్చినట్లున్నావ్!" విసుగ్గా అన్నాడు. రాజు చటు
క్కున లేచాడు. కళ్ళు నులుముకొని వాచ్ మేన్ వెంపు
దీర్ఘంగా చూసాడు. అతని కళ్ళు ఎర్రగా జ్యోతులల్లె
వున్నయ్!

"నాయనా! ఆ వైభోగాలు నాకు కలలో కూడా రావు! కనీసం నీపాటి వుద్యోగమైనా, నాకు దొరికితే నేను నిశ్చింతగా వుందును నా మహల్‌లో. తెలుసా!" అన్నాడు రాజు.

"అయితే నిరుద్యోగ డిపార్టుమెంటు మానేజరు వన్న మాట బాబూ! అయితే తొందరగా బయటకు నడువు. వుండి వురిడి వురేసుక చచ్చావంటే పోలీసులు నన్ను పట్టుకొని, ఎప్పుడు చూసావ్? నువ్వు ఎలా చూసావు? నువ్వు చూసినప్పుడు ఎలా వున్నాడు? వాడిలో నిస్పృహ గమనించగానే మాకు రిపోర్టు ఇయ్యకపోయావా? అంటూ లక్ష ప్రశ్న లేసి నన్నుకూడా వురేసుకునేట్లు చేస్తారు నా తండ్రివి కాదూ! తొందరగా బయటకు నడువు!" రాజుని బ్రతిమాలుతున్నట్లు అన్నాడు వాచ్ మెన్. రాజు అంతకన్నా మొండి వాడు!

"నా తండ్రివి నువ్వే నాయనా! అయిదునెల్ల అద్దె కట్టకపోతే ఇంటి యజమాని వెళ్ళగొట్టాడు. ఈ రాత్రికి ఇక్కడ పడుకోనిస్తే చచ్చి నీ కడుపున పుడతాను" అన్నాడు రాజు.

"ఇంకేం! నే ననుకున్నది రైటే అన్నమాట? చావటానికే వచ్చావా చిట్టినాన్నా? వెళ్ళుబాబూ, వెళ్ళు" చేతులు పుచ్చుకుని లేవదీసాడు వాచ్ మెన్.

నేను ఆత్మహత్య చేసుకోను బాబూ! నామాటనమ్ము.

నేనిక్కడ హాయిగా నిద్రబోతాను అంతే" అన్నాడు రాజు విసుగ్గా.

"నీ నిద్ర నాకు తెలుసులేవయ్యా మహాప్రభో! నెమ్మదిగా కొంప ముంచుతావ్. నడు నడు" గేటుదాకా తీసుకవెళ్ళి రాజుని అవతలికి వెళ్ళగొట్టి జాగ్రత్తగా గేటు మూసేసి లోపలికి నడుచుక పోయేడు.

రాజు కాస్సేపు ఆ పార్కుగేటువద్ద స్తబ్దుడై నిలబడి పోయేడు. దూరదూరంగా మేడల్లోని దీపాలకాంతిలో పల్చని వానజల్లులు వజ్రపు చెణుకుల్లా జిగ్‌జాగ్‌గా మెరుస్తున్నాయి. రాజుకి కడుపులో నీళ్ళుతప్ప ఇంకేమీ లేనందున చలిగాలి గజగజ లాడిస్తున్నది కర్తవ్యతా విమూఢునివలె ఎంతసేపో నిలబడిన రాజు ఆ వానలో తడుస్తూనే బయలుదేరాడు. వరసగావున్న మేడల నీడలు అతన్ని జాలిగా, చీకటిగా చూస్తున్నాయి. అనుకోకుండా వెనకాలనుంచి రిక్షా గణ గణలు వినపడ్డాయి. రాజు ప్రక్కగా ఆగింది ఆ రిక్షా.

"రాజుగారూ!" అంది ఆ గొంతు! స్త్రీది! రాజు ఉలిక్కిపడ్డాడు. వెనక్కితిరిగి చూసాడు!

"ఎవరది?" ఇన్ని రోజులుగా తన్ని పలకరించినవారే లేని రాజు ఆశ్చర్యపోయాడు

"నేనండీ! రమని" రిక్షాలోంచి దిగుతూ అన్నది.

"మీరా! చాలా రోజులయిందిచూసి! మీరేం చేస్తు న్నారు ఇప్పుడు?" అన్నాడు.

"ఎలిమెంటరీస్కూల్లో టీచరుపని దొరికిందండి."

"మరి మీరేం చేస్తున్నారు?" అంది రమ.

"కేరాఫ్ పార్కులో వుంటున్నానండీ! ఏమీ దొర కటంలేదు!"

రాజు ముఖంలోకి దీర్ఘంగా చూసింది రమ. ఎప్పుడూ తృళ్ళుతూ హుషారుగావుండే రాజుముఖం దీనంగా కన్పిం చింది.

"అదేమిటండీ! మేమంతా లేమా? మీ సామాన్లు అన్నీ తెచ్చేసుకునిరండి! మీకు ఉద్యోగం దొరికేదాకా మాతోపాటే వుందురుకాని" అంది రమ. రమకేసి ఆశ్చర్య పోయిచూసేడు. తామిద్దరూ ఆఫీసులో కలిసి పనిచేసే టప్పుడు మాటయినా మాట్లాడుకునేవారుకాదు! అలాంటిది ఇవ్వాళ ఇంత ఆప్యాయతతో తన ఇంటికి ఆహ్వానిస్తోంది. స్త్రీ సహజగుణం దయ! అనుకున్నాడు రాజు. వాన బాగా హెచ్చయిపోతోంది.

"నా కెక్కడా సామాన్లు మిగిలి లేవండీ!" అన్నాడు, సన్నగా తనలోతనే అనుకున్నట్లుగా.

"అయితే వెంటనే పదండి!" రిక్షాలో చోటు చేసింది. రాజు ఈ అయాచిత వాత్సల్యానికి కారణం వెదకదల్చు కోలేదు. అనుకోకుండా లభించిన ఈ ఆశ్రయాన్ని వదులు కోలేడు కదా! రమ ఇంటికి వెళ్ళేదాకా ఆలోచిస్తూనే కూర్చుంది. ఇంటికి వెళ్ళగానే తలుపుతీసిన సుందరినిచూసి ఆశ్చర్యపోయాడు ఆ చిన్నఇంట్లో సుందరి, పాప, రమ మాత్రమే వున్నారు. రాజు రమవైపు చూసాడు. రమ

నుదుట కుంకుమ కెంపులా వెలుగుతోంది. రమ రాజు విస్తు పాటును గ్రహించకపో లేదు: అయినా అది ఒక ముఖ్య మయిన విషయంగా ఆమె చెప్పదల్చుకోలేదు

"బట్టలు మార్చుకోండి రాజూ! బాగా తడిసున్నావ్. సుందీ! పెట్టెలోవున్న మీ బావగారి లుంగీ, చొక్కా— తీసియ్యవే! ఆ తుండుగుడ్డతో తల తుడుచుకోండి రాజూ!" అంది రమ. సైము పదకొండున్నర అయింది రాజుకి రమ ప్రవర్తన అంతా విచిత్రంగా వుంది. ఇంట్లో చిన్నపిల్లలని వదలి రమ అర్ధరాత్రి ఎక్కడ్నించి వస్తోంది? ఇంట్లో ఆమె భర్త ఎందుకు లేడు? సుందరికి రాజు ఎదురుగా ఆ చిన్న గదుల్లో అటూ ఇటూ తిరుగుతూ అన్నిపనులూ చేయవలసి రావటం మహా ఇబ్బందిగావుంది. అయినా అక్కగారితో ఏమీ అనలేదు.

"భోజనం చేస్తారా రాజూ!" అంది రమ. రాజు సుందరి ఇచ్చిన లుంగీ, షర్టూ వేసుకున్నాడు.

"ఇప్పుడేం భోజనం అర్ధరాత్రివేళ ?" అన్నాడు. సుందరి ఒక చిన్న ఈతాకులచాపా, బొంతా తీసుకుని వచ్చింది. ఆ గదిలో ఒకవార రాజూ, ఇంకొకవార రమా, పాపా నిద్రపోయారు. సుందరి వంటగదిలో పడుకుని నిద్ర పోయింది. మర్నాడు తెల్లవారింది. రాజు లేచాడు. కాల కృత్యాలు తీర్చుకున్నాక నెమ్మదిగా తన బట్టలు ధరించాడు

"మరి నేను వెళ్తానండీ" అన్నాడు రాజు. రమ నిబ్బ

రంగా ఊపిరి పీల్చుకుంది. సుందరి కౌగిలం ముక్కలతో కుంపటి రాజేస్తోంది.

"కాఫీ అయినా తీసుకోకూడదా?" అంది.

"అబ్బే దానికేం" నిజానికి రాజుకి చాలా ఆకలిగా వుంది. కాఫీయేకాదు డజను ఇడ్లీలయినా తినాలుంది అతనికి.

"రాజూ!"

రమకేసి చూసాడు రమ పాపవెంపు చూస్తోంది. పాప రాజువెంపు గుచ్చిగుచ్చి చూస్తోంది.

"నే నొకటి చెప్తున్నాను, ఏమీ అనుకోవద్దు" అంది నెమ్మదిగా.

"ఎందుకనుకుంటాను? ఈరాత్రి వానలో తడిసి బేజా రెత్తిపోకుండా కాపాడావు. దానికి కృతజ్ఞత అయినా చూప కుండగా పోతానా?" అన్నాడు రాజు. దీనంగా వుంది అతని గొంతు!

"అలాంటి కృతజ్ఞతలు మనమధ్య అనవసరం రాజూ! నేనూ పేదరాలిని. ఆకలిబాధని అర్ధం చేసుకోగలను. మీకు ఉద్యోగంలేదు. అందునా ఎవ్వరూ ఆదరువులేని ఈ మహా పట్నంలో ఆకలికోర్చి మైళ్ళకి మైళ్ళు నడచి, వుద్యోగం వెతుక్కోవాలంటే ప్రాణాలకి తెగించటం అన్నమాటే! అంచేత మీరు వుద్యోగం దొరికేదాకా మాతోపాటే వుండండి. ఏమీ మొహమాట పడొద్దు" ఆర్ద్రితతో అంది రమ. ఎందుకో రమ కళ్ళు తడిఅయ్యాయి. రాజు విస్తు

బోయాడు. రమ తన్ని వుద్యోగం దొరికేదాకా పోషిస్తా నంటున్నది. ఎంచేత? ఆరోజు తన్ని గురించి, తారని గురించి ఎంత ఎగతాళి చేసింది? ఇంతలో ఇంత భావపరివర్తన ఈమెలో ఎలా కలిగింది? ఎందుకు కలిగింది? ఇది అవ్యక్తంగా వుంది రాజుకి.

"అలానే వుండొచ్చు రమా! కాని, కాని" సందేహించాడు రాజు.

"ఏమిటా సందేహం రాజూ? నేను నీకు అక్కనే అనుకో! నా తమ్ముడే కనుక నిరుద్యోగిగావుండి ఆకలితో బాధపడుతోంటే నేను సాకకుండా వుంటానా రాజూ? నేను నీ అక్కని రాజూ! ఒక అమ్మ కడుపున పుడితేనే సోదరులు అవరు రాజూ! ఒకే అవస్థలో వున్నవాళ్ళుకూడా సోదరులే ఏక కుటుంబీకులే అవుతారు" ఆవేశంగా అంది రమ. రాజు చలించాడు.

"మరి మీ శ్రీవారు ఏమన్నా అనుకోరు రమా?" అన్నాడు. రమ మౌనంగా తలవాల్చింది. ఆమె కన్నులు నిశ్శబ్దంగా వర్షించసాగాయ్!

"క్షమించండి. మీకు మనోవేదన కలిగించినందుకు" రాజు బాధగా అన్నాడు.

"లేదు. మనమధ్య ఏమీ రహస్యాలులేవు రాజూ! వుండకూడదు కూడా! ఆయన నన్ను వదలి వెళ్ళిపోయారు రాజూ! వాళ్ళవాళ్ళకి పెద్ద సంపద కలిసొచ్చిందట! అంచేత ఆయన నన్నూ, నా పిల్లనీ వదిలేసి వెళ్ళిపోయారు. ఇప్పుడు

నేను మగదక్షత లేనిదాన్ని. అందుకనే నిన్ను, నాతో పాటుగా వుండమంటున్నాను. స్త్రీ ఎంత ఉద్యోగస్తురాలైనా, స్వయంపోషకురాలైనా, పురుషుని నీడనలేనిదే ఆ స్త్రీకి సంఘం మర్యాదస్తురాలిగా తావుఈయదు. నేను వంటి దాన్నయితే నా కర్మాన నేను నడుచుకుందును. కాని ఇద్దరాడ పిల్లల బాధ్యత నామీదవుంది. అటుచూడు. సుందరి నా చెల్లెలు! దాని బాధ్యత నేను పరువుగా నెరవేర్చాలి. అదిగో పెరుగుతున్న నా పంట దీన్నికూడా మంచి దృఢనీతిగల పిల్లలా పెంచాలి. రాజూ! ఆయన వెళ్ళిపోయిన ఈ ఆర్నెల్ల నుంచీ ఈ ఆలోచనతోనే నాకు తిన్న తిండికూడా వంటబట్టటంలేదు. నువ్వు కనిపించావు! నా ఒకే ఆశా నీతో చెప్పుకున్నాను. నిన్ను దేనికీ ఇబ్బంది పెట్టను. నాకు కావలసింది సంఘంలో గౌరవప్రదమైన జీవితం! భర్తృ పరిత్యక్త అయిన స్త్రీని ఆదరించటం పుట్టింటివారికి తప్పనిసరికదా! దురదృష్టంకొద్దీ పుట్టింటివారి తరఫున మిగిలిన దీ సుందరి. నువ్వు దొరికావు. నీ అక్క అయితే ఈ దీనావస్థనుంచి విముక్తి నొందించేవాడివికావా? మనస్ఫూర్తిగా చెప్పు రాజూ!"

రాజు విచలితుడైనాడు. ఒకనాడు తనకీ ప్రపంచంలో ఎవరూ లేకపోయినా, సేవాసదన్‌వాళ్ళ ధర్మమాఅని పెరిగి పెద్దవాడయ్యాడు. ఆ సదన్‌లోనే పెరిగి పెద్దవుతోన్న తార తప్ప అతనికి మరో బంధువూ, స్నేహితుడూకూడా లేరు. అదృష్టంకొద్దీ ఆనందాన్ని తృప్తిగా అనుభవించాడు. మళ్ళీ

ఒకనాడు జీవితం ఎదురు తిరిగింది. తార మాటామంతీ ఆడ లేనంతగా మారిపోయింది. వున్న ఒకే ఒక బాల్య స్నేహితు రాలూ, తనపట్ల హఠాత్తుగా ఎందు కింత మౌనం వహిం చిందో అవ్యక్తంగా వుండగానే వుద్యోగం వూడిపోయింది. ఆరోజు మొదటిసారిగా పార్కు బెంచీమీద కూర్చుంటే తనకి జీవితంమీద రోత కలిగింది. జీవితం చాలిద్దా మనుకున్నాడు. కాని పుట్టినాక తన్ని ఎవరూ చావనీయకుండానే పెంచు కొస్తున్నారు. అంచేత అతనికి చావటం అంటే భయమేసింది. చావలేక బ్రతికున్నాడు. మళ్ళీ ఈనాడు జీవితం అతని పట్ల కరుణ చూపించింది. అతని ఓర్పు, అతని జీవితాన్ని గెలిపిం చింది. ఒక అండ లభించింది. ఈ అండని తాను బుద్ధిపూర్వ కంగా వదులుకోడు. తారంత చంచల ప్రేమ కాదు రమది! తారది బాల్యచాపల్యం. రమది ప్రౌఢత్వపు ఆత్మీయత! రమ ఏనాటికీ తన్ని వదలలేదు. ఈ నిశ్చయం అతనికి ఆత్మ తృప్తి నిచ్చింది. సుందరి కాఫీ తెచ్చి, ఇత్తడి గ్లాసుల్లోపోసి అక్కకీ, రాజుకీ ఇచ్చింది. రాజు కాఫీ తాగుతూ, సుందరి వెంపు చూశాడు. సుందరి తొట్రుపడి లోపలికి వెళ్ళి పోయింది!

# 14

"హల్లో తారా గోపాల్ !" వెనక్కి తిరిగి చూసింది తార. గణేష్, పక్కన రోజీ కన్పించారు గణేశయ్యర్ చాలా మారిపోయేడు. తెల్లని గ్లాస్కో పంచె, సప్తపింజలూ పోసి కట్టుకున్నాడు. పైన సిల్కు లాల్చీ వేసుకున్నాడు. రోజీ చూస్తే ఆంగ్లో ఇండియన్‌లా లేదు. చెవులకి రవ్వల దుద్దులు మెరుస్తున్నాయి. కళ్ళనిండా కాటుక, నుదుట గుండ్రని కుంకుమ ధరించింది. కాళ్ళకి మట్టెలు కూడా వున్నాయి. వొత్తుగా వుండి, మెలికలు తిరుగుతూన్న జుట్టుని గట్టిగా బిగించి జడేసింది. తలనిండుగా కదంబమాలపెట్టింది. కంచి పట్టుచీర, జరీ అంచు వున్న బ్లవుజ్‌లో ఆమె దక్షిణ భారతీయ గృహిణిలానే వున్నది. ఆమె అభిరుచిని మెచ్చుకుంది తార పరిచయమయ్యాక !

"నా కెల్లా వున్నా ఫరవా లేదనుకో. కాని రోజీకి మన కట్టుబొట్లు అంటేనే ఎక్కువ ఇంటరెస్ట్ చూపెట్టుంది" అన్నాడు గణేష్.

"చాలా అదృష్టవంతులు !" అంది తార.

"మీ రొకసారి మా ఇంటికి రండి! మా అమ్మాయిని పురిటికి పిలుచుకొని వచ్చాము. ఏదో ఉత్సవం చేయాలిట ! నాకు ఏమేమి కావాల్నో తెలీదు. మీరు కూడా వస్తే

ఇద్దరం కలిసి అన్నీ ఆలోచించి చేయవచ్చును. నాకు ఈ సాయం చేసిపెట్టరా!" అంది రోజీ. తార తలూపింది.

"మీ రేం చేస్తున్నారు ?" అంది తార.

"ప్రస్తుతం సంస్కృతం నేర్చుకుంటున్నాను. వున్న దేదో పొదుపుగా ఖర్చు చేసుకుంటే మా కిద్దరికీ చాలదా ! వున్నది ఒక్క అమ్మాయి కదా" అంది రోజీ.

"మీరు బెంగుళూరులో వుద్యోగం చేస్తున్నారు అన్నారు ఎవరో !" అంది తార.

"లేదమ్మాయ్ ! అసలు ఆమెది బెంగుళూరు. వాళ్ళ ఫాదర్ నీలగిరి టీ తోటల్లో కొంచెం భాగస్థుడుగా వుండే వారు. ఆయన చనిపోయేక వాళ్ళ అమ్మ, చెల్లెళ్లూ షెఫీల్డు వెళ్ళిపోయారు. ఈమె ఇక్కడనే వుండిపోయింది" అన్నాడు గణేష్.

"అవునండి తారా! మీ దేశం అంటే నాకు ప్రాణం. మీ ఆధ్యాత్మిక నియమాలు, మీకు అనుకూలమైనట్టుగా, మాకు ఆచరణీయములు కాజాలకపోయినా మీ నిగ్రహ శక్తి మెచ్చుకోతగ్గది మీ కావ్యాలు, పురాణాలూ, ఎంతో జీవన సామరస్యాన్ని, నీతి నియమాలనీ ప్రబోధిస్తాయి, మీ రామాయణంలోని రాముని మానవత్వం నన్నెంతో స్పం దింపచేసింది. భగవంతుడై వుండీ కూడా మానవుడుగా అతను తన కర్తవ్య నిర్వహణ ఎల్లా నిర్వహించాడో చక్కగా రామాయణంలో నిరూపితమయింది" అంది రోజీ వివశంగా

అవన్నీ తారకి అసలు తెలీవు ? ఆమె హిందూ బాలిక అయి కూడా ఆ విదేశ స్త్రీకున్నంత భారతీయ ధర్మ పరిశోధనలోని ఆసక్తి కించిత్తయినా ఈమె చూపించలేక పోయింది. తార మనస్సు ఆందోళితమయింది. ఆ పురాణాలు కావ్యాలూ గురించి తారకి తెలీవు. తెలీని సంగతులు ఆమెకి వినబుద్ధి కావటం లేదు. అంచేత మాట మార్చి—

"మీరీ చీరలో చక్కగా మాకు మల్లేనే వున్నారు" అంది. రోజీ కళ్ళు దీపాల్లా వెలిగాయి.

"మీ కోడలిని అయినప్పుడు మీకు లానే వుండనా? ఈ చీరలో నా శరీరం గుప్తంగా దాచుకున్నాను. ఇప్పుడు నాకు ఫ్రాక్ వేసుకోవాలంటే శరీరం జలదరించుతుంది. అంటుకట్టిన కొమ్మలాంటిదాన్ని, నాకే ఇంతగా లజ్జా సంకోచాలు కలుగుతూంటే, ఈ అద్భుత దేశంలో మూర్తీభవించిన విచిత్రితా మూర్తులు మీకు, లజ్జే ఆభరణం అనటములో అసహజ మేముందీ ?" అంది రోజీ.

మన మెక్కడున్నాం ? మీ భూమిలో బంగారు పండుతుంది. వజ్రాల గనులున్నయ్ ! మీ తోటల్లో పండే మధుర ఫలాలు ఇలాతలంలో మరెక్కడా లభ్యమవవు. మీ మనుష్యులు ఆచరించే నీతి నియమాలు, ప్రపంచ ప్రజలంతా ఆచరించగలిగినప్పుడు ఈ భువిన అశాంతి అనేదే వుండదు ! కాని మన దేశ ఔన్నత్యాన్ని ఇంకో దేశం ప్రజలు కనిపెట్టి చెప్పాల్సిన స్థితిలో వున్నాం ! ఆ ఆంగ్లో ఇండియన్ వనితపాటి మనో నిశ్చలత్వం మన ధనిక వర్గాల

వారి కుటుంబాలలో అలవర్చుకుంటే, కొంత కాకపోతే కొంత అయినా, మన నైతిక దృష్టి, విదేశీయులకి అవగతమయ్యేది. తార, రోజీ భారతీయ దృక్పథాన్ని విని తలవంచుకుంది !

"మా ఇంటికి తప్పక వస్తారు కదూ ! మీలాంటి దేశీయ గృహిణి వద్ద నే నెన్నో సంగతులు తెలుసుకోవాలి" అంది రోజీ.

"తప్పకుండగా రామ్మా తారా ! అన్నట్లు గోపాల రాం వూళ్లో లేడు కదూ! వచ్చాక తప్పక రాండి" అన్నాడు గణేష్.

"తప్పక వస్తాను" అంది తార.

గణేశయ్యర్ అదృష్టవంతుడు. అతని మిగిలిన జీవితం సుఖశాంతులతో తులతూగిపోతూ వుంటుంది. అతను మామూలుగా భార్య చనిపోగానే బంధువుల అమ్మాయి నెవరినైనా, రెండో పెళ్ళి చేసుకుంటే, ఇల్లు నరక కూపంలా తయారు చేసేది. అంబిక మళ్ళీ పుట్టింట కాలు పెట్టకుండా వుండ వలసివచ్చేది. "రోజీ" భారతీయ గ్రంధాలన్నీ కంఠతా చదివింది. అందులోని స్త్రీ మూర్తుల త్యాగశీలత, పతివ్రతా స్వభావమూ ఆమెని ఆకర్షించాయ్! ఆమె స్వచ్ఛమైన హిందూస్త్రీగా జీవితం గడపాలనీ నిర్ణయించుకుని గణేష్‌ని భర్తగా స్వీకరించింది.

# 15

"జయనందిని వెళ్ళిపోతోందిట. చిన్నపార్టీ ఇద్దామని" డబ్బుకోసం గోపాలువద్ద నుంచుని అంది తార.

"ఎవరో ఒకరు ఇస్తారులెద్దూ! మనకేమిటి మధ్యన?" తేలిగ్గా పెదిమలు విరుస్తూ అన్నాడు గోపాలు.

"కాదు. ఇన్విటేషన్ కార్డ్సు ప్రింట్ చేయించాను కూడా. విరిశాల నృత్యంకూడా ఏర్పాటు చేయించాను. తీరా ఇప్పుడు మానేస్తే ఏం బాగుంటుంది?" అంది తార. ఈరోజు గోపాలురాం బాగా తీరిగ్గా వున్నాడు. కొత్తలో తార అతనికి చిన్నపిల్లలా కనిపించేది. బొత్తుగా నిర్ధనత్వం అనుభవించిన తార అంటే అతనికి గుండెలనిండా జాలి పొర్లుకొని వుండేది. అంచేత ఆమె చేతులనిండా డబ్బు తీసుకొని అంతూ పొంతూ లేకుండా ఖర్చుపెడుతూంటే ఆమె మనోల్లాసానికి అడ్డు తగలటం ఎందుకని నిర్లిప్తంగా వుండిపోయేవాడు. ఈ అయిదారు సంవత్సరాలుగా తార "వానిటీ"లని విపరీతంగా పెంచేసుకుంది. అది తన తాహతునికూడా మీరిపోతున్నట్లు అతనికి తోచింది. చూచినదల్లా చేతుల్లోకి తీసు తీసుకోవాలనే బాల్య చాపల్యము తారని వదలలేదు సరికదా, రోజురోజుకీ పెరిగిపోతోంది. కోరికలు తీరుతున్నకొద్దీ పెరుగుతాయి. తీరక ఆ తీరని కోరికలన్నీ ముక్కలుగా విరిగిపోతే విరాగులైపోతారు. తార ఆ పరిస్థితిలోనేవుంది. ఎవరెవరు

ఏయే ఆడంబరాలను ఆచరిస్తున్నారో గుర్తించుకుని గుడ్డిగా అనుకరిస్తుంది. గోపాలు ఈ మధ్య అప్పుడప్పుడూ మందలిస్తున్నాడు. కాని చిన్నపిల్లలా మారాంచేసి తన పంతం నెగ్గించుకువస్తోంది. అది తినలోని నీరసత్వం అనుకున్నాడు గోపాలురాం. ఇంక గట్టిగా చెప్పకపోతే లాభంలేదు అనుకున్నాడు

"నన్నడగకుండా ఇవన్నీ ఏర్పాటు చేయమని ఎవరు చెప్పారు నీకు? నేను ఇలాంటి ఆడంబరాలకి చిల్లికానీ ఇచ్చేదిలేదు. పోనీ చిన్నపిల్లకదా అని వూరుకుంటుంటే నెత్తికెక్కుతున్నావ్" అన్నాడు. భర్త అంత గట్టిగా చెప్పటం మొదటిసారి అయినందువల్ల తార కళ్ళమ్మట నీళ్ళొరాయ్?

"ప్లీజ్! ఈ వక్కసారికే! మళ్ళీ ఎప్పుడూ మిమ్మల్ని సంప్రతించకుండా ఏమీ ఏర్పాటు చేయను." తార ముఖం చూసేసరికి గోపాలుకి కోపం మంచులా కరిగిపోయింది!

"నువ్వో అందమైన బొమ్మవి తారా! ఇలా వున్న డబ్బు అంతా లెఖ్ఖా జమా లేకుండగా ఖర్చుపెట్టేస్తోంటే పుట్టబోయే పిల్లలకి ఏమయినా మిగలాలా లేదా?" లాలనగా అన్నాడు ఆ లాలనలోనే ముద్దుగా ఒకమాట జారేడు.

"నువ్వే ఆలోచించు తారా! మన పిల్లలకి మనం ఏమీ మిగల్చలేకపోతే వాళ్ళు మళ్ళీ లైట్ పోస్టుల క్రింద జేరి జీవిస్తూ కార్లో వెళ్ళే ప్రతియువకునివంకా ఆశతో చూస్తూ వుంటారు. అందరూ నా అంత తెలిగ్గా లొంగిపోయేవాళ్ళు వుంటారా?" నవ్వుతూ అన్నాడు. తార ఉలిక్కిపడింది. కళ్లు

వేదనతో ఎందుకు పోసాగాయ్! తను ఆశగా చూసిందా? అందుకని ఇంట్లో ఆశ్రయమిచ్చాడా! అంతేకాని తనపట్ల ఏమీ ప్రేమ లేదన్నమాట! నిజం. అతనికి తనపై ప్రేమ ఎందుకుంటుంది? ఇన్నాళ్ళకి తనకి కనువిప్పు కలిగింది. తనొక బీద యువతి! అతను వంటరి మనిషి! అందుచేత ఆశ్రయ మిచ్చాడు. కాని ఒక రోజన్నా తన్నిగురించి బాధపడ్డాడా! వున్నావా, తిన్నావా అని అడిగాడా! తను డబ్బు అడగటం అతను ఇవ్వటం అంతే! అంతకన్నా తామిద్దరిమధ్యా ఏమీ బంధంలేదు. నిజమైన భార్యాభర్తలు ఇలానే వుంటారా! తామిద్దరూ ఏమవుతారు? భార్యాభర్తలా! యజమానీ, నౌకర్లా! స్నేహితులా! అంతా అగమ్యగోచరంగా అవ్యక్తంగావుంది. తను తేలిగ్గా లొంగిపోయి తన్ని తనకి దానం చేసుకున్నాడట. తారకి చెప్పిన 'జోగప్ప'గుర్తుకి వొచ్చాడు. రమ! పాపం పిల్లలని పోషించుకుంటోంది. ఇద్దరూ ప్రేమించుకుని పెళ్ళిచేసుకున్నారుట! కాని ఏమిసుఖం! ఇది నాలుగు డబ్బులు కష్టపడి తెస్తే నాలుగుతన్ని ఆ డబ్బులు లాక్కొని వెళ్ళిపోయేవాడు. ఇప్పుడు సంపద అతన్ని వరించింది. నాలుగేళ్ళుగా శరీరాన్ని అర్పించి, తనదిగా వుండిపోయిన రమని కాదని వెళ్ళిపోయేడు. ఈ మగాళ్ళతీరే ఇంత! వాళ్ళ హృదయాలు పాషాణాలు. గోపాలుకయితే తన్ని చావడన్నాలిసిన అవసరంలేదు. డబ్బంతా తన చేతుల్లోనే వుంటుంది కనుక అతనివద్ద తనో భిక్షుకి మాత్రమే! అవును అతనివద్ద తనో

భిక్షుకి మాత్రమే. అవును. అన్నింటికీ తనూ అతన్ని యాచన చేయాల్సిందే !

గోపాలరాం రెండువేలకి చెక్కు వ్రాసి ఇచ్చాడు. "చూడు నటేశాన్ని మార్చుకు రమ్మను" అన్నాడు. నటేశం మార్చాలంటే ఆరోజు గోపాలురాంకి ఏదో ప్రయాణం వున్న దన్నమాటే!

"మీరు ఎక్కడికన్నా వెళ్ళాలా?" అంది.

"అవును. ఒకనెల్లాళ్ళు పనివుంటుంది" అన్నాడు గోపాలరాం.

"ఏం పని? నెల్లాళ్లు వుంటుందీ!" అంది తార దీర్ఘం తీస్తూ. గోపాలు ఆశ్చర్యపోయాడు. వున్నట్లుండి ఇంత శ్రద్ధ పుట్టిందేమిటా అని!

"వెళ్ళేప్పుడు ఎక్కడికని, ఏంపని అని అడక్కూడదు" అన్నాడు.

"అంత చెప్పకూడని చోటుకి వెళ్తున్నారన్నమాట!"

గోపాలుకి చిన్నసరదా వేసింది.

"నేనెల్లా పోతేనేం. నీ మొంటర్ టయిన్ మెంటుకి కావల్సిన డబ్బు ఇచ్చేగా?" అన్నాడు.

తార హృదయం అవమానంతో భగ్గుమంది. ఆకాశాన్న లెఖ్ఖలేనన్ని ఉల్కలు తెగి భూమిమీదకు రాలిపోతు న్నాయి. తార చప్పున దోసిట్లో ముఖం దాచుకుని అవ్యవధానంగా ఏడ్చేసింది.

"నే నెల్లా పోయినా, మీకు కక్కర్లేదు. అందుకనే

నిశ్చింతగా అల్లా అని వెళ్ళిపోతున్నారు. నాతో చెప్పరాని రహస్యాలు ఏవో మిమ్మల్ని చుట్టుముట్టటంచేతనే, నన్ను రోజురోజుకీ దూరం చేస్తున్నారు" గోపాలు హార్ధికంగా నవ్వాడు. కొంపదీసి తారకి పిచ్చెక్కటంలేదు గదా!

"తారా ఏమిటీ విపరీత బుద్ధి? ఇన్ని రోజులుగా లేని నా ఆరాలు కనుక్కోవాలనే ఆసక్తి నీకివ్వాళ ఎందుకు కలిగింది?" అన్నాడు.

"మీరు నిజం చెప్పండి. ఇన్ని రోజులూ డబ్బు గురించి నా వద్ద మీరేమీ నిర్బంధంగా మాట్లాడలేదు. ఇప్పుడు అడగలేదా! ఆజ్ఞ లియ్యలేదా?" అంది.

"నువ్వు బొత్తుగా నా చేయి దాటిపోతున్నావ్! అందుచేత కొద్దిగా అదుపులో పెట్టుకోవాల్సిన ఆవశ్యకత నాకు కనపడింది!"

"బొత్తుగా మీరు నాకు కాకుండగా పోతున్నారు. అవతలి ఆకర్షణ శక్తి ఎలాంటిదో తెలుసుకుందామని?"

గోపాలుకి ఎంతో ఆశ్చర్యం కలిగింది. తారేనా ఈమె! ఈమె స్త్రీగా మారిపోయింది కాబోలు! ఒక్క సారి తారని గట్టిగా హృదయానికి హత్తుకుని నలిపేయాలని పించింది. కాని అతనిలోని మానసిక దౌర్బల్యం అతన్ని నిలువబెట్టింది. ఆ దుర్బలత వల్లే అతను, తారని భార్యగా ఆదరించలేకపోయేవాడు. తారయందు కోరిక వున్నా ఆమె పూవు వంటి శరీరాన్ని స్పృశించటానికి అతనికి తనలోని

లోపం తెలుసును. చూసి చూసీ ఒక అనాధ బాలిక సౌందర్యాన్ని హత్యచేయగలిగేటంత కఠినుడు కాలేక పోయేడు గోపాలరాం !

"హో హో! చాలాదూరం వెళ్ళిందే! నీ కింకా ఆటలే కాని మాటలు రావు అనుకున్నాను. తీరుబాటుగా ఆలోచిస్తాను. తీరుబాటుగా ఆలోచిస్తాను నీ వ్యవహారం" అన్నాడు గోపాలరాం !

"తీరుబాటట ! తీరుబాటు మీ కెక్కడుందీ ! నేను చస్తే కాని తీరుబాటు వుండదు!" అంది తార. గమ్మున తార దగ్గిరగా వచ్చాడు. కోపంతో ఎర్రని ముద్ద మందార పువ్వులా వున్న ఆమె ముఖాన్ని రెండు చేతులా పట్టి అదిమి-

"తప్పుకాదూ : అల్లా తిట్టుకుంటావు ? నా దగ్గర నీకు భయం లేకుండగా పోతోంది" అంటూ చెంపల్ని గట్టిగా నొక్కి వదిలేసాడు.

ఇంతలో నౌకరు వచ్చి రమ వచ్చిందని చెప్పాడు. ఇద్దరూ క్రిందికి వొచ్చారు రమ ముఖం ఆనందంతో, విచ్చిన చామంతి పూవులా వుంది !

"ఏమిటి రమా విశేషం ! పాప ఏం చేస్తోంది. తార ఎప్పుడూ పాపనే అడుగుతూంటుంది !

"పాప బాగా ఆడుకుంటోంది. తారా! అంతా నీదయ. ఇంకో ముఖ్య విషయం చెప్దామని వొచ్చాను!" అంది రమ.

గోపాలరాం అనాసక్తిగా వింటున్నాడు

"ఏమిటంత ముఖ్య విషయం !" అంది తార.

'సుందరికి పెళ్ళిచేస్తున్నాను తారా ! రే పాదివారం పార్థసారథిస్వామివారి కోవెల్లో చేస్తాను. మీ రిద్దరూ నా కక్కావలిసినవాళ్ళు. ఈ ప్రపంచంలో అంతకన్నా ఇంకె వరూ లేరు ? అంచేత దయయుంచి మీ రిద్దరూ ఆ రోజు పైమంతా మాతో గడపాలి !" అంది రమ.

"అంతకన్నానా ! ఆయన మటుకు ఈ రోజే వూరు వెళ్ళిపోతున్నారు. నా కెల్లానూ తోచి చావదు. తప్పక మీతో గడుపుతాను" అంది తార.

"అల్లా కాదు ! ఏమండీ ! మీ చెల్లెలివంటి దాన్ని. నా మాట మన్నించి, ఆ రోజుకు మీరు కూడా వుండరూ" అంది రమ. ప్రార్థన నిండుకుంది ఆమె గొంతు. గోపాలరాం ఆర్ద్రిత పొందేడు.

"అల్లానే లేండి ! మేము ఇరువురం వస్తాము. ఇంతకీ పెళ్ళికొడుకేం చేస్తున్నాడు ?" అన్నాడు గోపాలరాం.

"మా స్కూల్లోనే టీచర్ ! మాకు తగ్గ సంబంధమే లెండి" అంది రమ.

"ఎవరు రమా! మీ స్కూల్లో అంతా ఆడవాళ్ళేగా టీచర్లుగా వర్కు చేస్తున్నారన్నావు" అంది తార.

"నన్ను క్షమించు తారా ! ఎప్పటికయినా తెలియక తప్పదు రాజు ఇప్పుడు మాతో వుంటున్నాడు మా స్కూల్లో టీచరుగా వర్కు చేస్తున్నాడు. అతనికి సుందరిని ఇస్తున్నాను. అతను చేసుకోడుకు మనస్ఫూర్తిగా ఇష్టపడ్డాడు" అంది రమ తల వాంచుకుని. తార గలగలా నవ్వింది. రమ తలె

త్తింది ఆశ్చర్యంగా. గోపాలు కూడా తార వెంపు విస్తు బోయి చూస్తున్నాడు. రమ రాజు తన వద్ద నున్నట్లు ఇంత వరకూ ఎందుకు చెప్పలేదో వూహించుకున్నాడు.

"పిచ్చి రమా ! ఎప్పటికయినా ఎందుకు తెలియాలి? ఎందుకు తెలియకుండగా వుండాలి ? నే నేమన్నా అనుకుంటానా ? రాజు నా కెవరని ? నువ్వూ, నేను, రాజు అంతా అవ్యక్తులమే. ఒక్కొక్కరి కొక్క జీవనాలంబనం దొరికింది. కాలం విసరే విసుర్లలో మీ రిద్దరూ ఒక కొసకి వచ్చారు ఏక కుటుంబీకులు అవుతున్నారు. నేను, నేను మీకు చాలా చాలా దూరంగా వున్నాను. కొన్నాళ్ళకి నేనూ ఏదో వొక విధముగా మీ బంధువుని కాలేకపోతానా ! ఆ చింత నాకు ఏ రూపంగానూ వుండదు. నన్ను నమ్ము సంతోషంగా. మీ ఇంట్లో ఆ రోజున పాల్గొంటాను" అన్నది తార. రమ సెలవు తీసుకుని వెళ్ళిపోయింది. గోపాలు దీర్ఘంగా ఆలోచిస్తోంటం చూసింది తార.

"ఏమిటా ఆలోచన ?" అంది తార.

"అవ్యక్తంగానే నీకు నేను చాలా అపకారం చేసాను తారా ! నువ్వూ, రాజూ ఎంత ఆత్మీయతగా వుండేవారో గణేష్ చెప్పాడు. నిజంగా మీ రిద్దరూ ఒకటైతే యెంతో ఆనందంగా వుండేవారు కామా" అన్నాడు గోపాలురావు. తార కిటికీలోంచి బయటకు చూసింది. చీకటి ఆకాశాన్ని కప్పుతోంది. నక్షత్రాలు చీకటిని చూసి ఇంకా మెరిసిపోతున్నాయి చిలిపిగా.

"ఒక్కటి నిజం. నా త్రికరణశుద్ధిగా నమ్ముతున్నా నండీ. మీరు నా జీవితానికి ఏ ఆపదా రాకుండా ఒక సుస్థిరతలో నిలిపేరు. అందుకు సర్వదా కృతజ్ఞురాలిని. ఇప్పుడు నాకు దేనిమీదా అంత కోరిక లేదు. నన్నిల్లా మీరు వుండనిస్తే చాల్ను" అంది తార.

గోపాలు తార దగ్గరగా వచ్చి ఆమె ముఖంలోకి చూసాడు. చంచలాలయిన తార నేత్రాల్లో నెమ్మది నెమ్మదిగా కృతజ్ఞత కూడుకొంటోంది.

"నీ ఓరిమి నిన్ను విజయని చేస్తుంది తారా!" నీకు నా వల్ల ఏమీ కష్టము కలగకుండా ఇకముందు కూడా చూసుకుంటానని హామీ ఇస్తున్నాను నువ్వెప్పుడూ ఆనందంగా వుండాలి తారా! ఆనందంగా వుండాలి!" అన్నాడు గోపాలు.

తారకి ఆ రాత్రి నిద్ర పట్టలేదు! ఎవరో తన్నివంచించారనే ఆవేదన పట్టుకుంది. ఫలానా వారు తన్ని వంచించారని అనుకోవటానికి ఆమెకు సాహసం లేదు. మళ్ళీ అందరూ తన మీద ప్రేమ ప్రకటిస్తోనే వంచించారు! ప్రేమపూర్వకమైన వంచన ఎంత అద్భుతంగా వుందీ! ఇది ఒక జీవితం కాని జీవితం. ఆమె రాత్రిల్లా ఏడుస్తోనే వుంది. ఎందుకు ఏడుపు వస్తోందో ఆమెకి అవ్యక్తంగానే వుండిపోయింది *

---

ఈ నవల యొక్క ముఖ్య పాత్ర చిత్రణని నాకు వ్రాహా రూపంగా అందించిన "శ్రీమతి కన్నబాలాసత్యం"కు

కృతజ్ఞతతో, అచ్యుతవల్లి.